

ఎన్నికల హామీల అమలుకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా బలంగా, సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలను రూపొందిస్తున్నారు. వేద కుటుంబాలకు భరోసా, భద్రత, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

బుధవారం 25.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 214 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



లాభాల పంట పండించేలా 'సాగు' కార్యాచరణ

- సీజన్‌కు ముందే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి
- ఉద్యానరంగంలో పెట్టుబడులకు ప్రత్యేకంగా హార్టికల్చర్ సమ్మిట్

• వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 24 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత ఆధునికంగా, లాభసాటిగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలపై సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల సంభవించిన వరుస తుఫాన్లు, ఎల్ నినో విపత్తుల వంటి ప్రకృతి వైపరీత్యాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో పంట నష్టాన్ని నివారించేలా సాగు విధానాల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు, స్పష్టమైన ఫలితాలు, అధిక లాభాలు కనిపించాలని స్పష్టం చేశారు.

ఉద్యాన పంటల్లో కొత్త రకాలకు ప్రాధాన్యం : హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు సహకారంతో సుమారు రూ. 40 వేల కోట్ల నిధులను సమీకరించాలని, మిగిలిన రూ. 60 వేల కోట్లను వివిధ పెట్టుబడుల ద్వారా సమకూర్చుకుని కార్యక్రమాలు చేపట్టాలని సీఎం సూచించారు. వీలైనంత త్వరలో హార్టికల్చర్ హబ్ పనులు ప్రారంభించాలని, ప్రతినెలా పురోగతిపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో ప్రకృతి వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఉద్యాన పంటల్లో కొత్త రకాలను పరిచయం చేస్తూ ఆధునిక సాగు విధానాలను ప్రోత్సహించాలని తెలిపారు. ఉద్యానవన రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు, బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా 'హార్టికల్చర్ సమ్మిట్'ను నిర్వహించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని, పంటల ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. ఉద్యానవన పంటల సాగుతో కరువు పరిస్థితులను అధిగమించేలా చర్యలు

2 లో



ఎన్నికల నిర్వహణలో అప్రమత్తం

- కౌంటింగ్ వేగంగా.. ఫలితాలు పారదర్శకంగా
- పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై దృష్టి
- నామినేషన్ల పరిశీలనలో నిబంధనలు పాటించాలి
- కలెక్టర్లు, ఎస్పీలకు ఎన్నికల కమిషనర్ దిశానిర్దేశం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కౌంటింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, నామినేషన్ల పరిశీలన, పోస్టల్ బ్యాలెట్ల నిర్వహణ, శాంతిభద్రతలు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సూచించారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులతో మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్ల ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం గతంలో కంటే రెండు నుంచి మూడు రెట్లు అధికంగా కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక్కో రౌండ్ కౌంటింగ్‌కు పట్టే సమయాన్ని ముందుగానే అంచనా వేసి, అవసరమైన మేరకు టేబుళ్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల లోపు కౌంటింగ్ ప్రక్రియ పూర్తిచేసి,

మిగతా 2లో...

ఎన్నికల ఖర్చులపై కొరడా

అభ్యర్థులందరూ వ్యయ వివరాలు ఇవ్వాల్సిందే

డిసెంబరు 21 తుది గడువు

నిబంధనలు ఉల్లంఘిస్తే అనర్హత వేటు

2 లో

అరుదైన ఖనిజ నిక్షేపాలతో అనంతకు మహర్దశ!

- 15 రకాల అరుదైన మూలకాల ఆనవాళ్లు
- లిథియం నిల్వలపైనా పరిశోధనలు
- వెలికితీతతో పరిశ్రమలకు కొత్త ఊపు
- స్థానిక యువతకు వేలాది ఉద్యోగాల ఆశలు



అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) : ఉమ్మడి అనంతపురం జిల్లాలో అపారమైన అరుదైన ఖనిజ సంపద వెలుగులోకి రావడం పారిశ్రామిక అభివృద్ధిపై కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. దేశవ్యాప్తంగా రేర్ ఎర్త్ కారిడార్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం, రాష్ట్ర ప్రభుత్వం ఖనిజాన్వేషణకు ప్రాధాన్యత ఇవ్వడంతో గతంలో గుర్తించిన అరుదైన ఖనిజ నిక్షేపాల వెలికితీతపై ఆసక్తి పెరుగుతోంది.

మిగతా 3లో...

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డైరెక్టరేట్

- ట్రాఫిక్ నిర్వహణలో సాంకేతికతకు పెద్దపీట..
- డీటీఎంఆర్ఎస్ ఏర్పాటు చేస్తూ హోంశాఖ జీవో
- డీజీపీ పర్యవేక్షణలో ఐజీ స్థాయి అధికారి నేతృత్వం
- 75 మందితో ప్రత్యేక విభాగం

2 లో

బంగారం రుణాలపై ఆర్‌బీఐ హెచ్చరిక

- బంగారం ధరల పతనంతో రుణదాతల్లో ఆందోళన
- 85 శాతం ఎల్‌టీవీ పరిమితి దాటే ప్రమాదం
- ఎన్‌బీఎఫ్‌సీలకు అప్రమత్తత సూచన
- పెరుగుతున్న గోల్డ్ లోన్ల నిరర్థక ఆస్తులు

3 లో

మృత్యుపాశాలైన రహదారులు

- మూడు జిల్లాల్లో ఘోర ప్రమాదాలు.. ఎనిమిది మంది దుర్మరణం
- నిద్రమత్తులో వాహన చోదకులు
- ట్యాంకర్‌ను ఢీకొన్న వాహనం.. నలుగురు మృతి
- లారీ క్యాబిన్‌లో చిక్కుకుని ఇద్దరు సజీవ దహనం
- కాలువలోకి దూసుకెళ్లిన కారు.. ఇద్దరు అయ్యప్ప భక్తుల మృతి



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రహదారులపై కాసింత నిర్లక్ష్యం.. కునుకు తీసిన క్షణం.. ఆరు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో వేర్వేరు చోట్ల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాలు ఎనిమిది మందిని బలిగొన్నాయి. నిద్రమత్తు కారణంగా చోటుచేసుకున్న ప్రమాదాల్లో కొందరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. అయ్యప్ప మాలధారణతో దర్శనానికి వెళ్లి తిరిగివస్తున్న భక్తుల ప్రయాణం విషాదాంతమైంది.

ట్యాంకర్‌ను ఢీకొని నలుగురు మృతి : విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న వాహనం.. రహదారి పక్కన నిలిపి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు.

మంటల్లో చిక్కుకుని సజీవ దహనం : విశాఖపట్నం జిల్లా ఆనందపురం

మిగతా 2లో...

మామిడి రైతులకు పంటల బీమా భరోసా



- ఎకరాకు రూ.35 వేల వరకు బీమా రక్షణ
- డిసెంబర్ 31లోగా నమోదు చేసుకోవాలి
- ప్రీమియం రూ.1,650 నుంచి రూ.2,250 వరకు

ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్) : ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో మామిడి పంటకు కలుగుతున్న నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాలను అమల్లోకి తెచ్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి మామిడి పంటను వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం,

మిగతా 2లో...



వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఉత్కంఠ

- రెండో రోజు కొనసాగిన రాజకీయ హైడ్రామా
- ఆత్మకూరులో జనసేన రెబల్ శిరీషకు పీఠం
- రాజంపేటలో షబ్రీన్‌కు అవకాశం
- ధర్మవరం, ఎలమంచిలిలో ఏకగ్రీవ ఎన్నికలు

అమరావతి: రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వైస్ చైర్మన్, చైర్‌పర్సన్ ఎన్నికలు రెండో రోజూ రాజకీయ ఉత్కంఠ నడుమ కొనసాగాయి. కూటమి పార్టీల మధ్య అభ్యర్థుల ఎంపికపై ఏకాభిప్రాయం కుదరక కొన్ని ప్రాంతాల్లో వాగ్వాదాలు, నిరసనలు చోటుచేసుకున్నాయి. పార్టీ నాయకత్వం జోక్యం చేసుకోవడంతో చివరకు వివాదాలు సద్దుమణిగాయి. అధిష్ఠానం నిర్ణయించిన అభ్యర్థులకే మద్దతు తెలుపుతూ కౌన్సిలర్లు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు.

ఆత్మకూరులో శిరీషకు వైస్ చైర్‌పర్సన్ పదవి : నెల్లూరు జిల్లా ఆత్మకూరు

మిగతా 3లో...

గల్లంతైన బోటు కోసం వేట



- పారాదీప్ సమీపంలో విస్తృతంగా అన్వేషణ
- కోస్ట్‌గార్డ్‌తో సమన్వయం చేసుకోవాలి
- అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్) : కాకినాడ జిల్లా ఉప్పాడకు చెందిన ఏడుగురు మత్స్యకారులతో సముద్రంలో గల్లంతైన బోటు ఆచూకీ లభించకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మత్స్యకారుల ఆచూకీ కనుగొనేందుకు చేపడుతున్న గాలింపు చర్యలపై ఆరా తీశారు. అన్వేషణను మరింత ముమ్మరం చేసి, మత్స్యకారులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

మిగతా 2లో...

ఎన్నికల ఖర్చులపై కొరడా

విజయవాడ, నవంబర్ 24 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో నిర్వహించిన రెండో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరూ తమ ఎన్నికల వ్యయానికి సంబంధించిన తుది వివరాలను డిసెంబర్ 21లోగా తప్పనిసరిగా సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సూచించారు. ఎన్నికల్లో గెలిచినవారు, ఓడిపోయినవారు అనే తేడా లేకుండా ప్రతి అభ్యర్థి ఖర్చుల వివరాలను సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు.

2026 నవంబర్ 7న ఎన్నికల ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం–1994లోని సెక్షన్ 230–దీ ప్రకారం ఫలితాల ప్రకటన తేదీ నుంచి 45 రోజుల్లోగా ఎన్నికల ఖర్చుల వివరాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ నియమావళి–2006లోని రూల్ 100(2) ప్రకారం సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయం ద్వారా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి ఈ వివరాలు అందజేయాలని పేర్కొన్నారు.

నిర్ణీత గడువులోగా ఎన్నికల వ్యయ వివరాలు సమర్పించని అభ్యర్థులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 19–దీ ప్రకారం ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించని అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు మూడేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హతకు గురవుతారని తెలిపారు. అటువంటి అభ్యర్థి ఎన్నికై ఉంటే పదవిని కూడా కోల్పోయే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

ఎన్నికల వ్యయ వివరాల సమర్పణపై అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు అభ్యర్థులను సంప్రదించి వివరాలను సకాలంలో స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి ఒక్కరూ డిసెంబర్ 21లోగా తమ ఎన్నికల ఖర్చుల తుది వివరాలను సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని అనిల్ చంద్ర పునేఠా విజ్ఞప్తి చేశారు.

గల్లంతైన బోటు కోసం వేట

(మొదటి పేజీ తరువాయి)

ఉప్పాడకు చెందిన ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 4న మోటరైజ్డ్ ఫిషింగ్ బోటులో చేపల వేటకు బయలుదేరారని అధికారులు సీఎంకు వివరించారు. పారాదీప్ పోర్టు సమీపానికి చేరుకున్న తర్వాత వారి నుంచి సమాచారం అందలేదని, నవంబర్ 19 నుంచి బోటుతో సంబంధాలు తెగిపోయాయని తెలిపారు. సమాచారం అందిన వెంటనే కాకినాడ, చెన్నై, ఒడిశాలోని కోస్ట్‌గార్డ్ స్టేషన్ల అధికారులతో సంప్రదింపులు జరిపి గాలింపు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ మేరకు కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారులు భారత కోస్ట్‌గార్డ్‌కు లేఖ రాసినట్లు తెలిపారు.

మత్స్యకారుల మొబైల్ ఫోన్లు, బోటులోని ట్రాన్స్‌పాండర్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో ఆచూకీ గుర్తించడం కష్టంగా మారిందని అధికారులు వివరించారు. జీపీఎస్ ద్వారా కూడా బోటు స్థానం గుర్తించలేకపోయినట్లు తెలిపారు. భారత కోస్ట్‌గార్డ్ నౌకలు, హెలికాప్టర్ల సహాయంతో పారాదీప్ తీర ప్రాంతంలో విస్తృతంగా గాలింపు చేపడుతున్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల కుటుంబాలను మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్ అధికారులు కలిసి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

గాలింపు చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే ఇతర రక్షణ విభాగాల సహకారం కూడా తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మత్స్యకారుల ఆచూకీకి సంబంధించి లభించే ప్రతి సమాచారాన్ని బాధిత కుటుంబాలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. గల్లంతైన వారి కోసం అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగించాలని స్పష్టం చేశారు.

మృత్యుపాశాలైన రహదారులు

(మొదటి పేజీ తరువాయి)

మండలం బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద ఉదయం మరో ఘోర ప్రమాదం జరిగింది. లారీ ప్రమాదానికి గురై క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో అందులో చిక్కుకున్న డ్రైవర్, క్లీనర్ బయటకు రాలేక సజీవ దహనమయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో వారిని రక్షించే అవకాశం లేకుండాపోయింది.

కాలువలోకి దూసుకెళ్లిన కారు : పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలో జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు అయ్యప్ప భక్తులు ప్రాణాలు కోల్పోయారు. క్రోసూరుకు చెందిన ముగ్గురు అయ్యప్ప మాలధారులు అమరావతిలో దర్శనం ముగించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



గుంటూరు, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి కార్పొరేషన్, పొన్నూరు మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సి యం సాయికాంత్ వర్మ తెలిపారు.

మంగళవారం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పూనేఠ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాల కవరేజీ ఏర్పాటు చేయాలని సూచించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన అదనపు టేబుళ్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

గత జిల్లా పరిషత్ ఎన్నికల సమయంలో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసినప్పటికీ గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమర్థవంతంగా విధులు నిర్వహించారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అన్నారు. గుంటూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ మాట్లాడుతూ మంగళగిరి కార్పొరేషన్, పొన్నూరు మున్సిపాలిటీలకు సంబంధించి పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల్లో అదనపు టేబుళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

లాభాల పంట పండించేలా 'సాగు' కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలని తెలిపారు. ఉద్యానవన సాగులో అన్ని రాష్ట్రాల కంటే ఏపీ ముందుందని అధికారులు వివరించారు. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆధునిక పంటల సాగును ప్రోత్సహించడంతో పాటు కొత్త రకాల పంటలను రైతులకు పరిచయం చేయాలని, భూసార పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రైతులతో పాటు కౌలు రైతుల ప్రయోజనాలను కూడా కాపాడాలని సూచించారు.

తుఫాన్లను తట్టుకునేలా పంటల సాగు క్యాలెండర్ : తుఫాన్ల కారణంగా పంటలకు నష్టం వాటిల్లకుండా అవసరమైతే పంటల సాగు క్యాలెండర్‌ను ముందుకు జరపాలని సీఎం ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి సాగును ముందుగానే ప్రారంభించి తుఫాన్ల ప్రభావం పంటలపై పడకుండా చూడాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వరి పంటలకు ఇటీవల సంభవించిన తుఫాన్లతో పెద్దగా నష్టం వాటిల్లలేదని, దీనిపై వరి రైతుల్లో అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ప్రతి పంట సీజన్ ప్రారంభానికి ముందే సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం సూచించారు. వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవసరాలు, నీటి లభ్యత, పంటల సాగు కాలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. 2027–28 నాటికి 26.5 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని తెలిపారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ అంశానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉటంకిస్తూ మరోసారి కేంద్రానికి లేఖ రాయాలని తెలిపారు. అలాగే, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమర్థ నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం సూచించారు. జలధార–2 పనులను మార్చి నాటికి పూర్తి చేయాలని, అవసరమైతే జలధార–3 కార్యక్రమాన్ని కూడా చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో వర్షపాతం ఎంత నమోదవుతోంది, భూగర్భ జలాల లభ్యత ఎంత ఉందనే అంశాలపై కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండాలని, వర్షపు నీటి వినియోగం, భూగర్భ జలాల సంరక్షణకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

రైతుల కోసం అన్ని సేవలూ ఒకే యాప్‌లోకి : వ్యవసాయం, ఆక్వా, హార్టికల్చర్ రంగాలకు సంబంధించిన సేవలన్నింటినీ ఒకే యాప్ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులకు అవసరమైన సమాచారం, సాగు సూచనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఒకే వేదిక ద్వారా అందుబాటులోకి తేవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాల నుంచి క్షేత్రస్థాయి సమాచారం సేకరించి ఏడాది పొడవునా రాష్ట్రంలో పచ్చదనం ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అగ్రిటెక్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించి, దాని సమర్థ వినియోగంపై అధికారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. మేకలు, గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించి పశుసంపదను పెంచాలని, వీబీ–జీ రామ్–జీ పథకాన్ని పశుసంపద అభివృద్ధికి ఏ మేరకు వినియోగించుకోవచ్చో అధ్యయనం చేయాలన్నారు.

12.64 లక్షల హెక్టార్లలో పంట నష్టం : ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎల్‌నినో కరువు పరిస్థితులు, అర్నబ్, మురసు తుఫాన్లు, భారీ వర్షాల కారణంగా 26 జిల్లాల్లో మొత్తం 12.64 లక్షల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు వివరించారు. ఇందులో 9.67 లక్షల హెక్టార్లలో ఎల్‌నినో కరువు ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. అర్నబ్ తుఫాను కారణంగా 13 జిల్లాల్లో 3.82 లక్షల మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతినగా, మురసు తుఫాను ప్రభావంతో 9 జిల్లాల్లో 52,402 మంది రైతులకు చెందిన పంటలకు నష్టం వాటిల్లింది. తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న పంట నష్టం వివరాలతో నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.



ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న పంటలకు మొత్తం రూ. 2,743 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని అధికారులు ప్రతిపాదించారు. రాష్ట్రంలో 11.55 లక్షల హెక్టార్ల సాగు విస్తీర్ణం పంటల బీమా పరిధిలో ఉందని అధికారులు తెలిపారు. నష్టపోయిన పంటలకు రూ. 1,732 కోట్ల బీమా క్లెయిమ్‌లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు.

ప్రతి రైతు బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. బీమా కింద ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు బీమా పరిహారం కూడా అందే అంశంపై సమగ్ర అవగాహన కల్పించాలని తెలిపారు.

డిజి రైతు బజార్ ప్రారంభించాక ఇప్పటికి లక్షకు పైగా ఆర్డర్లకు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. అలాగే మొబైల్ రైతు బజార్లు వచ్చే ఫిబ్రవరి కల్లా మరో 40 పెంచనున్నట్టు వివరించారు. ఈ సమీక్షలో వ్యవసాయ, ఉద్యాన శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డైరెక్టరేట్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మరణాలను నియంత్రించడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను ఆధునీకరించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోలీస్ శాఖలో ప్రత్యేకంగా డైరెక్టరేట్ ఆఫ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ (డీటీఎంఆర్ఎస్)ను ఏర్పాటు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం కేంద్రంగా పనిచేసే ఈ విభాగం డీజీపీ పరిపాలన, కార్యాచరణ నియంత్రణలో కొనసాగనుంది.

రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నియంత్రణకు ఏకరీతి విధానాలు అమలు చేయడం, ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థను విస్తరించడం, ప్రమాదాలపై శాస్త్రీయ విశ్లేషణ చేపట్టడం ఈ డైరెక్టరేట్ ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి. ముఖ్యంగా జాతీయ రహదారులపై నిరంతర పెట్రోలింగ్, ప్రమాద ప్రాంతాల గుర్తింపు, రహదారి భద్రతా చర్యల రూపకల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

పోలీస్, రవాణా, రోడ్లు–భవనాల శాఖల మధ్య సమన్వయానికి ఈ విభాగం కీలకంగా వ్యవహరించనుంది. కేంద్ర, రాష్ట్ర స్థాయి రహదారి భద్రతా సంస్థలతో సంప్రదింపుల కోసం డైరెక్టర్ ప్రిన్సిపల్ పోలీస్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఐజీ స్థాయి ఐపీఎస్ అధికారి డైరెక్టర్‌గా, డీఐజీ స్థాయి అధికారి సహాయకుడిగా బాధ్యతలు నిర్వహిస్తారు.

కొత్తగా ఉద్యోగాలు, పోస్టులు సృష్టించకుండా పోలీస్ శాఖలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని సర్దుబాటు చేసి ఈ డైరెక్టరేట్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కనీసం 50 మంది నుంచి గరిష్ఠంగా 75 మంది వరకు సిబ్బందిని కేటాయించనున్నారు. వీరిలో ఇద్దరు ఎస్పీ లేదా అదనపు ఎస్పీ స్థాయి అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉంటారు. అవసరాన్ని బట్టి రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖలకు చెందిన సాంకేతిక నిపుణులను డిప్యుటేషన్‌పై తీసుకోనున్నారు.

మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఇప్పటికే ఉన్న భవనాలు, వసతులనే స్టేట్ ట్రాఫిక్ కమాండ్ అండ్ అనలిటిక్స్ సెంటర్ ఏర్పాటుకు వినియోగించనున్నారు. కొత్త భవనాల నిర్మాణానికి అవకాశం లేకుండా అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరికరాల కొనుగోలు, నిర్వహణకు స్టేట్ రోడ్ సేఫ్టీ ఫండ్, రోడ్ సేఫ్టీ సెస్, పోలీస్ ఆధునికీకరణ నిధులను వినియోగించనున్నారు.

ఇదిలా ఉండగా, వివిధ విభాగాల మధ్య అధికారాల పునరావృతాన్ని నివారించేందుకు ప్రస్తుతం ఉన్న రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ పదవి కొనసాగింపు, అవసరమైతే ఇతర వ్యవస్థల్లో విలీనం చేసే అంశాలను సమీక్షించాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని డీజీపీని ఆదేశిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ జీవో జారీ చేశారు. కొత్త డైరెక్టరేట్ ఏర్పాటుతో రాష్ట్రంలో రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ మరింత సమర్థంగా అమలవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

తుది ఫలితాలు ప్రకటించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

ఏకగ్రీవ ఎన్నికల వివరాలు : మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సుమారు 19 శాతం వరకు సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, సుమారు 36 శాతం వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమావేశంలో వివరించారు. ఎన్నికల నిర్వహణలో కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

మిగిలిన దశల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి : మొదటి, రెండు, మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన పోలీసు బలగాలను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. ఏకగ్రీవ ఎన్నికలు జరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, మిగిలిన ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు తగిన భద్రతా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.

కలెక్టర్లు, ఎస్పీల కృషి అభినందనీయం : ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు చేస్తున్న కృషిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అభినందించారు. ప్రారంభ దశలో కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్లు స్వయంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయడాన్ని అభినందించారు. అదేవిధంగా ఎస్పీలు కూడా ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. అదేవిధంగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిన వెంటనే స్పందించి పరిష్కరించడం అభినందనీయమన్నారు.

ఎన్నికల షెడ్యూల్‌పై సమీక్ష : ఎన్నికల షెడ్యూల్‌ను వివరిస్తూ నవంబర్ 26వ తేదీన 23 పట్టణ స్థానిక సంస్థలు, 26 జిల్లాల్లో (విశాఖపట్టణం, గుంటూరు మినహా) గ్రామ పంచాయతీలకు మొదటి దశ ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. అదే రోజు గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు వెలువడతాయన్నారు. నవంబర్ 30వ తేదీన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. నవంబర్ 29వ తేదీన రెండవ దశ, డిసెంబర్ 2వ తేదీన గ్రామ పంచాయతీల మూడో దశ ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని, డిసెంబర్ 5వ తేదీన 23 పట్టణ స్థానిక సంస్థలకు పరోక్ష ఎన్నికలు నిర్వహించడంతో మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని వివరించారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలి : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రతి అధికారి తూచా తప్పకుండా పాటించాలని పునరుద్ఘాటించారు. గ్రామ పంచాయతీల్లో 3 వ దశ నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసినందున, తదుపరి అవసరమైన భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సూచించారు.

రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిర్దేశిత గడువులోగా ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్లలో చెల్లని ఓట్ల సంఖ్య అధికంగా నమోదవుతున్న అంశాన్ని ప్రస్తావిస్తూ, దీనికి గల కారణాలను విశ్లేషించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి సరైన శిక్షణ అందించడంతోపాటు, ఓటు వేసే విధానంపై ఓటర్లకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, నిరక్షరాస్యులైన ఓటర్లకు ఓటు వేసే విధానాన్ని వివరించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అయితే, ఓటు వేసే సమయంలో అభ్యర్థుల పేర్లు, ఎన్నికల గుర్తుల విషయంలో ఎలాంటి గందరగోళం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రీకౌంటింగ్ అభ్యర్థనలపై గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రిటర్నింగ్ అధికారులు నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఓట్ల లెక్కింపు పూర్తయి, ఫలితాలు ప్రకటించి, రిటర్నింగ్ అధికారి సంతకం చేసిన తర్వాత మళ్లీ రీకౌంటింగ్ చేపట్టాల్సిన పరిస్థితి రాకుండా ముందుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ద్వారా అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 650 మంది ఓటర్లు మించకుండా నిబంధనలను అనుసరించి ఏర్పాట్లు చేయాలని, ఒకే లొకేషన్ లో ఉన్న పోలింగ్ కేంద్రాలను మాత్రమే హేతుబద్ధీకరించాలన్నారు. తక్కువ సంఖ్యలో ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను నిబంధనలకు అనుగుణంగా ఒకే ప్రదేశంలో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అయితే, పోలింగ్ కేంద్రాల మార్పులు, సర్దుబాట్లపై ఓటర్లకు ముందుగానే విస్తృతంగా సమాచారం అందించాలని స్పష్టం చేశారు.



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, వాటి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ, భద్రత విషయంలో కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్లపై సీరియల్ నంబర్లు, ఎన్నికల గుర్తుల ముద్రణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తుది జాబితా ఖరారయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను ఎన్నికల పిటిషన్ల పరిష్కారం, సంబంధిత న్యాయపరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకొని కనీసం 60 రోజుల పాటు భద్రపరచాలని సూచించారు. ఏదైనా ఎన్నికల పిటిషన్ దాఖలై, ఎలక్షన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు మాత్రమే ఫుటేజ్‌ను సంబంధిత న్యాయస్థానానికి సమర్పించాలే తప్ప, వ్యక్తులకు నేరుగా కాపీలు అందించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల నిర్వహణకు కట్టుబడి ఉండాలని రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున స్పష్టం చేశారు.

ఐజీ బి. రాజకుమారి మాట్లాడుతూ...లి గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్ల దాఖలు చేసుకునేలా పూర్తి భద్రత కల్పించాలని, ఎలాంటి బెదిరింపులు, దాడులు, భయభ్రాంతులకు తావులేకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కొన్ని ప్రాంతాల నుంచి అభ్యర్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆమె పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

సంబంధిత జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లు తమ పరిధిలోని అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని ఐజీ సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో తగినన్ని మొబైల్ పోలీసు బృందాలను ముందుగానే మోహరించాలని, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి సమయాల్లో కూడా ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి బస చేస్తున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. 23 పట్టణ స్థానిక సంస్థలకు మరియు మొదటి దశలో ఎన్నికలకు వెళ్లే గ్రామ పంచాలయతీలకు 24.11.2026 సాయంత్రం 5 గంటలతో ప్రచార కార్యక్రమం ముగుస్తున్నందున, బయట ప్రాంతాల వారు లాడ్జీలు, హోటళ్లు, షెల్టర్

బంగారం రుణాలపై ఆర్‌బిఐ హెచ్చరిక



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : బంగారం ధరలు భారీగా పడిపోతున్న నేపథ్యంలో పసిడి రుణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలను (ఎన్‌బీఎఫ్‌సీ) హెచ్చరించింది. ధరల తగ్గుదలతో బంగారం తాకట్టుపై ఇచ్చిన రుణాలకు సంబంధించిన లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తులు ప్రతికూలంగా మారే ప్రమాదం ఉందని సూచించింది. కొన్ని రుణాలు నిర్దేశించిన 85 శాతం ఎల్‌టీవీ పరిమితిని దాటే పరిస్థితి రావచ్చని ఆందోళన వ్యక్తం చేసింది.

తగ్గిన తాకట్టు విలువ : తాకట్టు పెట్టిన బంగారం విలువతో పోలిస్తే రుణదాతలు ఎంత మొత్తంలో రుణం ఇస్తున్నారో తెలిపే నిష్పత్తినే ఎల్‌టీవీగా పరిగణిస్తారు. గత నెల రోజుల్లో బంగారం ధరలు గరిష్ఠ స్థాయిల నుంచి సుమారు 30-40 శాతం వరకు పడిపోయినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో రుణాలకు తాకట్టుగా ఉన్న బంగారం విలువ తగ్గి, రుణదాతలపై రిస్క్ పెరుగుతోంది. ఎల్‌టీవీ నిష్పత్తులు అధికంగా ఉన్న సంస్థలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆర్‌బీఐ సూచించినట్లు సమావేశంలో పాల్గొన్న వర్గాలు తెలిపాయి.

పెరుగుతున్న ఎన్‌పీఏలు : మరోవైపు బంగారు రుణాల రంగంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) కూడా పెరుగుతున్నాయి. ట్రాన్స్‌యూనియన్ సిబిల్ గణాంకాల ప్రకారం 2026 ఆగస్టు చివరి నాటికి గోల్డ్ లోన్ల ఎన్‌పీఏలు 0.30 శాతానికి చేరాయి. మార్చి 31 నాటికి ఈ స్థాయి 0.16 శాతంగా ఉంది. ఒకటి కంటే ఎక్కువ పసిడి రుణ ఖాతాలు ఉన్నవారు చెల్లింపుల్లో జాప్యం చేసే అవకాశాలు అధికంగా ఉన్నట్లు సంస్థ పేర్కొంది. ధరల పతనం, పెరుగుతున్న బకాయిల నేపథ్యంలో బంగారు రుణాలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

మామిడి రైతులకు పంటల బీమా భరోసా



(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పరిధిలోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఎకరాకు గరిష్ఠంగా రూ. 35 వేల వరకు బీమా రక్షణ పొందే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.

మామిడి తోటలకు వాతావరణ మార్పుల వల్ల సంభవించే నష్టాలను దృష్టిలో ఉంచుకుని ఈ బీమా సదుపాయాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. అర్హులైన రైతులు నిర్ణీత ప్రీమియం చెల్లించి పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బీమా నిబంధనలకు అనుగుణంగా పంట నష్టం జరిగితే పరిహారం పొందవచ్చని వివరించారు. బీమా నమోదు చేసుకోవడానికి డిసెంబర్ 31వ తేదీని తుది గడువుగా నిర్ణయించినట్లు వెల్లడించారు.

ప్రీమియం, బీమా వివరాలు : ఒక్కో ఎకరానికి రూ. 35 వేల వరకు బీమా కవరేజీ లభిస్తుంది. రైతులు తమ వాటాగా ఎకరాకు రూ. 1,650 నుంచి రూ. 2,250 వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. సగటున రూ. 1,750 ప్రీమియంతో బీమా సదుపాయం పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.

నమోదుకు పలు మార్గాలు : రైతులు తమ స్మార్ట్‌ఫోన్లలో 'పీఎంఎఫ్‌బీవై క్రాప్ ఇన్సూరెన్స్ ఫార్మర్' యాప్ ద్వారా స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చు. సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీలు), బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, అధీకృత బీమా ప్రతినిధుల ద్వారా కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంది. గ్రామ, మండల స్థాయి ఉద్యాన శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులను సంప్రదించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయవచ్చు.

అవసరమైన పత్రాలు : బీమా నమోదు సమయంలో ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ ప్రతులు, భూమి పట్టాదారు పాస్‌బుక్ లేదా 1-బీ నకలు సమర్పించాలి. మామిడి పంట సాగు చేస్తున్నట్లు స్వీయ ధ్రువీకరణ పత్రం, మొబైల్ నంబర్, పాస్‌పోర్టు సైజు ఫొటో అవసరం. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు పత్రాన్ని అందజేయాలి.

గడువు ముగిసే వరకు వేచి చూడకుండా రైతులు ముందుగానే బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని షాజానాయక్ సూచించారు. పథకానికి సంబంధించిన సందేహాలు, ఇతర వివరాల కోసం సంబంధిత మండల ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి..

బ్రహ్మంగారిమఠం,నవంబర్ 24 (జర్నలిస్ట్ ఫైల్): గ్రామ పంచాయతీ ఎన్నికలు - 2026 కు సంబంధించి బ్రహ్మంగారిమఠం మండలంలో నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) సోమవారం పూర్తయింది.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెల్లడించిన ప్రొఫార్మా-3 నివేదిక ప్రకారం మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొత్తం లి50 సర్పంచ్ నామినేషన్లు 197 వార్డు సభ్యుల నామినేషన్లులి చెల్లుబాటు అయినట్లు అధికారులు ప్రకటించారు.మండలంలో మొత్తం 11 సర్పంచ్ స్థానాలు, 122 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

పంచాయతీల వారీగా చెల్లుబాటు అయిన నామినేషన్లు

-సోమిరెడ్డిపల్లె: 1 సర్పంచ్, 23 వార్డు
- రేకలకుంట: 5 సర్పంచ్, 12 వార్డు
- మల్లెపల్లె: 6 సర్పంచ్, 24 వార్డు
- తోట్లపల్లె: 1 సర్పంచ్, 10 వార్డు
- దిరసవంచ: 9 సర్పంచ్, 21 వార్డు
- డి. నేలటూరు: 4 సర్పంచ్, 16 వార్డు
- నాగిశెట్టిపల్లె: 3 సర్పంచ్, 16 వార్డు
- టి. చౌదరివారిపల్లె: 4 సర్పంచ్, 27 వార్డు
- గొడ్లవీడు: 7 సర్పంచ్, 14 వార్డు
- పలుగురాళ్లపల్లె: 8 సర్పంచ్, 24 వార్డు
- ముడమాల: 2 సర్పంచ్, 10 వార్డు

అత్యధికంగా దిరసవంచలో 9 సర్పంచ్ నామినేషన్లు చెల్లుబాటు కాగా, టి. చౌదరి వారిపల్లెలో అత్యధికంగా 27 వార్డు నామినేషన్లు చెల్లుబాటు అ-య్యాయి.

సోమిరెడ్డిపల్లె, తోట్లపల్లె పంచాయతీలలో ఒక్కొక్క సర్పంచ్ నామినేషన్ మాత్రమే చెల్లుబాటు కావడం విశేషం.

తదుపరి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం తుది అభ్యర్థుల జాబితా ఖరారు కానుంది.

ఎన్‌సీడీ స్క్రీనింగ్ ద్వారా మరో 4 ఆరోగ్య పరీక్షలు

- ఊబకాయం, కాలేయ, శ్వాసకోశ, మానసిక ఆరోగ్యంపై స్క్రీనింగ్
- బీపీ, మధుమేహం, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ పరీక్షలకు అదనంగా
- 750 ఐబ్రెస్ట్ పరికరాలతో 10 లక్షల మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ పరీక్షలు
- ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా స్క్రీనింగ్ వివరాల నమోదు
- వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- త్వరలో స్క్రీనింగ్ ప్రారంభానికి సిద్ధంకావాలని అధికారులకు మంత్రి ఆదేశాలు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో పెరుగుతున్న అసంక్రమిత వ్యాధుల ముప్పును తగ్గించి, రోగులకు సకాలంలో వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ 2026-27లో వార్షిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తోంది. ఇప్పటివరకు అధిక రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు సంబంధించి ఐదు ప్రధాన వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తుండగా.. కొత్తగా ఊబకాయం, కొవ్వు కాలేయ వ్యాధి, దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు, మానసిక ఆరోగ్య సమస్య(మొత్తం 4)ను చేర్చి తొమ్మిది రకాల ఆరోగ్య పరీక్షలకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు ఎన్‌సీడీ (నాన్ కమ్యునకబుల్ డిసీజెస్) 1.0, 2.0, 3.0, 4.0 పేర్లతో 18 ఏళ్లు పైబడినవారికి స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి ఇకపై ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఈ స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతాయి.

ఈ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆరోగ్య పరీక్షలు జరగబోతున్నాయి. రాష్ట్రంలో 18 ఏళ్లకు పైబడిన వారికి స్క్రీనింగ్ పరీక్షలు జరుగనున్నాయి. మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న ఊబకాయం, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును దృష్టిలో ఉంచుకుని పరీక్షల పరిధిని విస్తరిస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఎన్‌సీడీ పరీక్షలపై వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సమావేశంలో తీసుకురాబోతున్న మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. పరీక్షల నిర్వహణ పక్కాగా జరిగేందుకు కిందటేడు ఓటీపీ విధానం మాదిరిగా కాకుండా ముఖ ఆధారిత (ఎఫ్‌ఆర్ యస్) పద్ధతిలో సర్వే జరపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ వేదిక పూర్తైనంతరం సర్వే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. 'ఒకే లక్ష్యం - ఒకే బృందం: అసంక్రమిత వ్యాధులపై సమష్టి పోరాటం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కెవియన్ చక్రధర్‌బాబు వివరించారు.

ఊబకాయంపై అప్రమత్తం చేసేలా : అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ల పరీక్షలను కొనసాగిస్తూనే కొత్తగా నాలుగు ఆరోగ్య సమస్యల గుర్తింపు, చికిత్సకు ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించారు. పెరుగుతున్న ఊబకాయ సమస్యను దృష్టిలో ఉంచుకుని పెద్దలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాల ప్రకారం అధిక బరువు, ఊబకాయం ఉన్న మహిళల శాతం 36.3 నుంచి 47.9 శాతానికి, పురుషుల్లో 31.3 నుంచి 41.5 శాతానికి పెరిగింది. అధిక బరువు ఉన్నవారిని ముందుగానే గుర్తించి, ఇతర ఆరోగ్య సమస్యల ముప్పును అంచనా వేస్తారు. ఆహారపు అలవాట్లు, వ్యాయామం, బరువు నియంత్రణపై అవగాహన కల్పించి అవసరమైన సలహాలు ఇస్తారు. ఊబకాయం, అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారిలో కొవ్వు కాలేయ వ్యాధి ముప్పును పరిశీలిస్తారు.

పొగాకు పొగ, ఇంటి లోపల, బయట గాలి కాలుష్యం, వృత్తిపరమైన దుమ్ము కారణంగా వచ్చే దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలను ముందుగానే గుర్తించేందుకు చర్యలు చేపడతారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు పరీక్షించి అవసరమైన వారికి చికిత్స అందిస్తారు. మరిన్ని పరీక్షలు అవసరమైన వారిని ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులకు పంపిస్తారు. అక్కడ శ్వాస సామర్థ్యాన్ని పరీక్షించే స్పైరోమీటర్లను అందుబాటులో ఉంచుతారు.

టెలీమానస్ ద్వారా... : ప్రజలకు నిర్వహించే ఆరోగ్య పరీక్షల్లో మానసిక సమస్యల గుర్తింపునూ చేర్చారు. ఇందుకోసం సమాజ ఆధారిత ఆరోగ్య అంచనా ప్రశ్నావళిలో కుంగుబాటు, ఆందోళన, జ్ఞాపకశక్తి సమస్యలు, మానసిక భ్రాంతులకు సంబంధించిన ప్రశ్నలను చేర్చుతారు. ముప్పు ఉన్నట్లు గుర్తించిన వారికి టెలీ మానస్ ద్వారా ఫోన్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. మరింత వైద్య పరిశీలన అవసరమైన వారిని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ద్వారా సంబంధిత ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారు. మానసిక వైద్యుల సలహాలు, కౌన్సెలింగ్ కోసం 14416 నంబరుతో టెలీ మానస్ సేవలు అందుబాటులో ఉంటాయి.

వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు : దీర్ఘకాలిక అనారోగ్యంతో మంచానికే పరిమితమైనవారు, రోజువారీ పనులు చేసుకోలేని వృద్ధులు, పక్షవాతం బాధితులు, చివరి దశ క్యాన్సర్ రోగులను గుర్తించి అవసరమైన ఉపశమన వైద్య సేవలు అందిస్తారు. గ్రామ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి, నొప్పి, ఇతర లక్షణాలను పరిశీలిస్తారు. అవసరమైతే వైద్యాధికారుల పరీక్షలు, సంచార వైద్య సేవల ద్వారా చికిత్స అందిస్తారు. రోగుల సంరక్షణ, పరిశుభ్రత, ఆహారం, కదలికలు, లక్షణాల గుర్తింపుపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. ఈ స్క్రీనింగ్ ఎలా జరపాలన్నదానిపై క్షేత్ర స్థాయి వైద్య, ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేకంగా తర్ఫీదునిస్తారు.

అభా ఐడీతో అనుసంధానం : వైద్య సేవల్లో పారదర్శకత, కచ్చితమైన నమోదు కోసం ఎన్‌సీడీ ముఖ గుర్తింపు (ఎఫ్‌ఆర్‌ఎస్) విధానాన్ని అమలు చేయనున్నారు. సర్వే సందర్భంగా నిర్ధారణ కోసం బయోమెట్రిక్ కూడా తీసుకుంటారు. ఆరోగ్య గుర్తింపు సంఖ్య (అభా) జారీ చేసి, వారి వైద్య రికార్డులను అనుసంధానిస్తారు. పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స, తదుపరి వైద్య పరిశీలన వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేస్తారు. అనుమానిత కేసులు, ఆసుపత్రులకు పంపిన వివరాలు, చికిత్స ప్రారంభం, క్యాన్సర్ రోగుల కీమోథెరపీ దశలు, తదుపరి పరీక్షలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు. ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల యాప్‌లు, సంబంధిత పోర్టళ్ల ద్వారా వివరాలను నమోదు చేసి జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో పర్యవేక్షిస్తారు.

ఐబ్రెస్ట్ పరికరాల వినియోగంతో త్వరగా కేసుల గుర్తింపు : ఎంపిక చేసిన గ్రామ ఆరోగ్య కేంద్రాల్లో 750 ఐబ్రెస్ట్ పరీక్షా పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటి ద్వారా త్వరలో చేపట్టబోయే స్క్రీనింగ్ ద్వారా 10 లక్షల మంది మహిళలకు ఐబ్రెస్ట్ పరికరం ద్వారా రొమ్ము క్యాన్సర్ సంబంధిత పరీక్షలు చేయనున్నారు. ఈ పరికరంతో రేడియేషన్ లేకుండా పరీక్షలు చేయవచ్చు. అనుమానాస్పద ఫలితాలు వచ్చినవారికి శిక్షణ పొందిన వైద్యులు మరోసారి పరీక్షించి, అవసరమైన తదుపరి వైద్య సేవలకు పంపిస్తారు.

మహిళా స్వయం సహాయక సంఘాల సహకారంతో : మహిళలు ఆరోగ్య పరీక్షల్లో ఎక్కువగా పాల్గొనేలా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థల సహకారం తీసుకుంటారు. ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థల బృందాలు కలిసి పనిచేస్తాయి. స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో వైద్య సేవలు అందించే విధానాన్ని అమలు చేస్తారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నూరా హెల్త్ బృందం ద్వారా ఆరోగ్య అవగాహన సమావేశాలు నిర్వహిస్తారు. వ్యాధుల వారీగా డిజిటల్ బృందాలు ఏర్పాటు చేసి మందుల వినియోగం, తదుపరి పరీక్షలపై సందేశాలు పంపిస్తారు. ఈ విధానాన్ని కృష్ణా జిల్లాలోని బొల్లపాడు, ఎన్టీఆర్ జిల్లాలోని రాయపాడు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.

క్యాన్సర్ కేసులపై ప్రత్యేక ఫోకస్: ప్రభుత్వ వైద్య కళాశాలల ఆసుపత్రుల్లోని 17 క్యాన్సర్ నివారణ, పరీక్షా కేంద్రాలను మరింత బలోపేతం చేస్తారు. ఈ కేంద్రాల్లో ప్రతి మంగళవారం, గురువారం ప్రత్యేకంగా 222వ నంబరు ఓపీ ద్వారా క్యాన్సర్ అనుమానితులకు వైద్య పరీక్షలు, నిర్ధారణ, నిపుణుల సలహాలు అందిస్తారు. కీమోథెరపీ ప్రారంభించిన రోగులకు తదుపరి చికిత్స అందించేందుకు 23 డే కేర్ కీమోథెరపీ కేంద్రాలను అనుసంధానిస్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ఆసుపత్రుల సదుపాయాలు లేని చోట తొలిదశలో తొమ్మిది జిల్లా ఆసుపత్రుల్లో క్యాన్సర్ నిర్ధారణ సేవలను బలోపేతం చేస్తారు.

ప్రాంతీయ, జిల్లా స్థాయి ఆసుపత్రుల్లో అసంక్రమిత వ్యాధుల ప్రత్యేక వైద్య విభాగాలు, వృద్ధుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి బలోపేతం చేస్తారు. అవసరమైన చోట ఫిజియోథెరపీ సేవలు కూడా అందిస్తారు. ఈ సేవలకు 333వ నంబరు ఓపీని కేటాయిస్తారు.

అరుదైన ఖనిజ నిక్షేపాలతో అనంతకు మహర్దశ!

(మొదటి పేజీ తరువాయి)



జాతీయ భూ భౌతిక పరిశోధనా సంస్థ (ఎన్‌జీఆర్ఐ), జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) పరిశోధనల్లో ఉమ్మడి జిల్లాలో 15 రకాల అరుదైన మూలకాలతో పాటు లిథియం ఆనవాళ్లు గుర్తించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నిక్షేపాల పరిమాణం, నాణ్యత నిర్ధారణ అనంతరం తవ్వకాలు, శుద్ధి పరిశ్రమలు ప్రారంభమైతే జిల్లా పారిశ్రామిక రంగానికి కొత్త ఊపునిచ్చే అవకాశం ఉంది.

పలు ప్రాంతాల్లో ఖనిజాల గుర్తింపు : అనంతపురం జిల్లాలోని పెద్దవడుగూరు మండల కేంద్రంతో పాటు చింతలచెరువు, బుక్కరాయసముద్రం మండలం దండువారిపల్లె, గుంతకల్లు మండలం దంచెర్ల, పెద్దపప్పూరు మండలం రెడ్డిపల్లి పరిసర ప్రాంతాల్లో అరుదైన ఖనిజ మూలకాల ఉనికిని ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు గుర్తించారు. ముఖ్యంగా దంచెర్ల ప్రాంతంలోని ఆల్కలీన్ సైనైట్ శిలా నిర్మాణం సుమారు 18 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నట్లు పరిశోధనల్లో వెల్లడైంది. మరోవైపు శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలోని దాడితోట, తురకవారిపల్లె పరిసరాల్లో సుమారు ఐదు చదరపు కిలోమీటర్ల పరిధిలో లిథియం ఆనవాళ్లను జీఎస్ఐ గుర్తించింది. అయితే ఈ ఖనిజాల వాస్తవ నిల్వలు, వాణిజ్యపరమైన వినియోగ సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు మరింత లోతైన డ్రిల్లింగ్, శాస్త్రీయ పరిశోధనలు అవసరం.

ఆధునిక పరిశ్రమలకు కీలక ముడిసరుకు : ఈ ప్రాంతాల్లో అల్లనైట్, మోనజైట్, జిర్కాన్, సెరియేట్, కొలంబైట్ వంటి ఖనిజాలతో సంబంధం ఉన్న లాంథనం, సిరియం, నియోడైమియం, ఇత్రియం తదితర అరుదైన మూలకాల ఆనవాళ్లు గుర్తించారు. వీటిని ఆధునిక సాంకేతిక పరిశ్రమల్లో కీలక ముడిసరుకుగా వినియోగిస్తారు. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, శక్తివంతమైన అయస్కాంతాలు, పవన విద్యుత్ టర్బైన్లు, సెమీకండక్టర్లు, అంతరిక్ష ప్రయోగాలు, రక్షణ రంగ పరికరాల తయారీలో వీటికి విస్తృతమైన డిమాండ్ ఉంది. ముఖ్యంగా భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాల విస్తరణతో ఈ ఖనిజాలకు అంతర్జాతీయంగా ప్రాధాన్యత మరింత పెరిగే అవకాశముంది.

స్థానిక యువతకు ఉపాధి.. పరిశ్రమలకు బాటలు : ఖనిజ నిల్వలు వాణిజ్యపరంగా అనుకూలమని నిర్ధారణ అయితే మైనింగ్, ఖనిజాల వేర్పాటు, రసాయన శుద్ధి, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు మార్గం సుగమమవుతుంది. ఉమ్మడి జిల్లాలోనే ఖనిజ శుద్ధి, అనుబంధ పరిశ్రమలను నెలకొల్పితే స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, సాంకేతిక విద్య అభ్యసించిన యువతకు స్థానికంగానే ఉద్యోగాలు పొందే అవకాశం ఏర్పడుతుంది. రవాణా, నిర్మాణం, నిర్వహణ, ఇతర అనుబంధ సేవల రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి.

మైనింగ్ కార్యకలాపాల ద్వారా ప్రభుత్వానికి రాయల్టీ ఆదాయం సమకూరడంతో పాటు జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్) ద్వారా ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు అందే అవకాశం ఉంటుంది. వీటితో ఆసుపత్రులు, పాఠశాలలు, తాగునీటి సదుపాయాలు, రహదారుల అభివృద్ధికి తోడ్పాటు లభించవచ్చు. అయితే పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణ, స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తవ్వకాలు చేపట్టడం కీలకం.

అనంతకు పారిశ్రామిక భవిష్యత్తుపై ఆశలు : ప్రస్తుతం గుర్తించిన ఖనిజ ఆనవాళ్లు పూర్తిస్థాయి వాణిజ్య నిల్వలుగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఇందుకోసం సమగ్ర సర్వేలు, నమూనాల విశ్లేషణ, డ్రిల్లింగ్, సాధ్యాసాధ్యాల అధ్యయనాలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలు పూర్తయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రాజెక్టులను ముందుకు తీసుకెళితే ఖనిజ సంపదకు నిలయంగా ఉన్న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు భవిష్యత్తులో కీలక పారిశ్రామిక కేంద్రాలుగా ఎదిగే అవకాశం ఉంది. సహజ వనరులను స్థానిక అభివృద్ధికి అనుసంధానించగలిగితే రాయలసీమ ఆర్థిక ప్రగతికి ఈ ఖనిజ సంపద కొత్త దిశ చూపనుంది.

వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఉత్కంఠ



(మొదటి పేజీ తరువాయి)

మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక వ్యవహారం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. జనసేన రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కొలగాని శిరీషకు చివరకు పార్టీ అధిష్ఠానం మద్దతు లభించడంతో ఆమెకే పదవి దక్కింది. సోమవారం ఎన్నికల సందర్భంగా శిరీష అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ కొందరు కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేయడంతో మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఎన్నిక ప్రక్రియ కూడా వాయిదా పడింది.

శిరీష అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఇద్దరు జనసేన కౌన్సిలర్లు, 12 మంది టీడీపీ సభ్యులు, ఒక బీజేపీ సభ్యుడు ఎన్నికకు దూరంగా ఉన్నారు. మరోవైపు ఆమెకు మద్దతుగా 10 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు, ఇద్దరు జనసేన రెబల్ సభ్యులు, ఒక సీపీఐ సభ్యుడు హాజరయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జోక్యం చేసుకుని వివిధ వర్గాలతో చర్చలు జరిపారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు శిరీషకు మద్దతు కూడగట్టడంతో 17 మంది కౌన్సిలర్ల మద్దతుతో ఆమె వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

రాజంపేటలో షబ్రీన్‌కు బాధ్యతలు : కడప జిల్లా రాజంపేట మున్సిపాలిటీలోనూ వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక రెండో రోజూ ఉత్కంఠభరితంగా సాగింది. సోమవారం ఎన్నిక వాయిదా పడటంతో మంగళవారం నిర్వహించిన ప్రక్రియకు టీడీపీ పరిశీలకులు, కౌన్సిలర్లు హాజరయ్యారు. విప్ జారీ చేసే సమయంలో కొందరు టీడీపీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ శివప్రసాద్‌ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవాలని పట్టుబట్టారు. అయితే పార్టీ నాయకత్వం ఆదేశాలను పాటించాలని పరిశీలకులు స్పష్టం చేశారు. దీంతో కౌన్సిలర్లు అంగీకరించడంతో 9వ వార్డు సభ్యురాలు షబ్రీన్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం ఆమె ప్రమాణస్వీకారం చేశారు.

ఎర్రగుంట్లలో కొత్త పాలకవర్గం ప్రమాణం : కడప జిల్లా ఎర్రగుంట్ల నగర పంచాయతీలో చైర్‌పర్సన్‌గా గోర్ల మధులత, వైస్ చైర్‌పర్సన్‌గా ఇట్రెడ్డి శ్వేత బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్‌రావు వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరయ్యారు.

ధర్మవరంలో జనసేనకు వైస్ చైర్‌పర్సన్ పదవి : శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్ పదవి జనసేనకు దక్కింది. 26వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం వాయిదా పడిన ఎన్నికను మంగళవారం తిరిగి నిర్వహించగా, ఆమె పేరును బీజేపీ కౌన్సిలర్ వెంకటేష్ ప్రతిపాదించగా, టీడీపీ కౌన్సిలర్ మాధవరెడ్డి బలపరిచారు. పోటీలో మరో అభ్యర్థి లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి విజయలక్ష్మి ఏకగ్రీవ ఎన్నికను ప్రకటించారు.

ఎలమంచిలిలో నానాజీ ఏకగ్రీవం : అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. గొర్లె శివన్నారాయణమూర్తి అలియాస్ నానాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో రాష్ట్రంలోని పలు పట్టణ స్థానిక సంస్థల్లో పెండింగ్‌లో ఉన్న వైస్ చైర్మన్, చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియ పూర్తయింది.

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు

అమరావతి, నవంబర్ 24 (జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సచివాలయంలో మంగళవారం కలిశారు. 2027 జనవరి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించనున్న 37వ పుస్తక మహోత్సవానికి ముఖ్యమంత్రిని ఆ

డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

- డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ
- ఉప ఐక్యత, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యానికి ప్రతీకగా సంబరాలు



ఖమ్మం, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : వైరా నియోజకవర్గ హెడ్ క్వార్టర్స్ లో కామిశెట్టి కళ్యాణమండపంలో బడుగు, బలహీన వర్గాల విద్యా, సామాజిక అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి, మాజీ గురుకులాల సెక్రటరీ స్వేరోస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఖమ్మం జిల్లాలో స్వేరోస్, ఆర్.ఎస్.పి. కోర్ టీం , భీమ్ వారియర్స్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సార్ స్వేరోస్ నెట్వర్క్ ద్వారా సమాజంలో సంస్థ గతి మార్పులు తీసుకురావడానికి అదేవిధంగా గురుకుల విద్యార్థులను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవడానికి అనేక వినూత్న కార్యక్రమాలు చేసి ఈరోజు పేద వర్గాల అభ్యున్నతి కోసం ప్రజల పక్షంగా ఎప్పుడూ ఉండే త్యాగపూరిత విషయాలు స్మరించుకుంటూ ముఖ్య అతిథులు కొనియాడారు. రాబోవు రోజుల్లో డాక్టర్ ప్రవీణ్ కుమార్ గొప్ప సంస్కరణకర్తగా ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా ప్రవీణ్ కుమార్ ఉంటారని ఆశాభావం వ్యక్తం చేస్తూ రాబోవు రోజుల్లో కూడా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆశయాలకు, అనుగుణంగా మీరందరూ కూడా ఉండాలని అతిథులుగా విచ్చేసిన వారిలో ప్రముఖ విద్యావేత్త , బిఆర్ఎస్ నాయకులు,ఆర్ జె సి కృష్ణ, చిలకా చిన్నకోటయ్య, బమ్మెర రామ్మూర్తి, అప్పం సురేష్, మాదిగ దండోరా నాయకులు కొరపల్లి శ్రీను తెలియజేశారు. అదే వివిధ మండలాల నుంచి ముఖ్య నాయకులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో సమాజంలో విద్యా చైతన్యాన్ని, సామాజిక స్పృహను పెంపొందించేందుకు చేస్తున్న కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రతి ఒక్కరూ విద్యావంతులై ఆత్మగౌరవంతో జీవించాలని ఆయన చేస్తున్న సామాజిక ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం స్వేరోస్ కుటుంబ సభ్యులుగా, బహుజన ఉద్యమ శక్తులుగా ఐక్యంగా పనిచేస్తూ విద్యా, సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వ సాధనకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.జన్మదిన వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే సామాజిక బాధ్యతకు నాంది కావాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉదయ్ స్వేరో,పృథ్వి స్వేరో, శ్రీనాథ్ స్వేరో,బి.వి స్వేరో, శ్రీకాంత్ స్వేరో, శరత్ స్వేరో,నారాయణ స్వేరో, మహేష్ స్వేరో, ప్రవీణ్ కుమార్ స్వేరో,సాయి కుమార్ స్వేరో, గణేష్ స్వేరో, దుర్గా ప్రసాద్ స్వేరో,అన్వర్, రాంబాబు మరియు స్వేరోస్ భీమ్ వారియర్స్, వివిధ రకాల ఉద్యమ నాయకులు పాల్గొన్నారు

అన్నదానం మహా భాగ్యం



ఖమ్మం, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : అన్నదానం నిర్వహించడం వల్ల మహా భాగ్యం కలుగుతుంది అని ముదిగొండ సొసైటీ అధ్యక్షులు తుపాకుల యలగొండస్వామి అన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా ముస్తఫానగర్ లో దివ్య మణికంఠ అన్నదాన సేవా సమితి లో తుపాకుల ఎలగొండస్వామి సుమారు వెయ్యి మంది అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలగొండస్వామి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పాటించడం లో అయ్యప్ప దీక్ష కీలకమన్నారు. అన్నదానం నిర్వహించడం గొప్ప విషయం అన్నారు.ఈ కార్యక్రమం లో దివ్య మణికంఠ అన్నదాన సేవా సమితి అధ్యక్షులు చిర్ర రవి, కార్యదర్శి పుట్ట మల్లికార్జున, శేఖర్, రవితేజ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి చొరవ తోగోళ్లపాడుకు కొత్త సొసైటీ

- రైతులకు మరింత చేరువలో సేవలు
- క్యాంపు కార్యాలయంలో కృతజ్ఞతలు
- వ్యవసాయ సహకార పరపతి సంఘం ఏర్పాటు
- జీవో విడుదలపై గ్రామస్తుల హర్షం



ఖమ్మం,నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడులో నూతన వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో గ్రామ రైతుల చిరకాల ఆకాంక్ష నెరవేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం ఆధ్వర్యంలో గోళ్లపాడు గ్రామస్తులు ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి చేరుకుని క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంపిణీ చేశారు. సొసైటీ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపాల్సిందిగా కోరారు.గతంలో ఏదులాపురం పరిధిలోని సొసైటీ ద్వారానే రైతులు సేవలు పొందేవారని, ఇప్పుడు ఖమ్మం రూరల్ మండల రైతులకు మరింత చేరువగా గోళ్లపాడులోనే నూతన సొసైటీ ఏర్పాటు కావడం సంతోషంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా తుంబూరు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన సొసైటీకి పీఏసీఎస్ కమిటీ ఏర్పాటు చేస్తామని, రైతుల అభ్యున్నతికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, ఎల్లారెడ్డి, చంద్రారెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రుద్ర ఉపేందర్, నాయకులు తేజావత్ పంతులు, మాధవరెడ్డి, తొండల రవి, సింగిరెడ్డి బోసురెడ్డి, కృష్ణమూర్తి, కొప్పుల వెంకటేశ్వర్లు, తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు, గడ్డమీద ఉపేందర్, బొందల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి

- కార్డుల జారీలో డీపీఆర్ఓ నిర్లక్ష్యం వీడాలి
- రెండు, మూడు రోజుల్లో కార్డులు ఇవ్వకుంటే కార్యాలయం ముట్టడి, అవసరమైతే ఆమరణ దీక్ష
- జర్నలిస్టులకు కేటాయించిన 23.02 ఎకరాల స్థలాన్ని పరిశీలించిన ఫెడరేషన్ జిల్లా నేతలు
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్



ఖమ్మం, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :

అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజే) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. జర్నలిస్టులకు కేటాయించిన 23.02 ఎకరాల స్థలాన్ని ఫెడరేషన్ నేతలు పరిశీలించారు. అలాగే అర్హులైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం డిసెంబరు 5 నుంచి 9 వరకు నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ కేబుల్ టీవీ, కార్పొరేషన్ పరిధితో పాటు ఏ,బీ,సీ గ్రేడ్‌లలోని చిన్న, మధ్య, పెద్ద పత్రికల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు అనేక రకాల కారణాల పేరుతో, సాంకేతిక లోపాలు చూపుతూ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. గతంతో పోలిస్తే ఎక్కువ ప్రెస్ అకాడమీ కార్డులు ఇచ్చామని చెబుతూనే, మరోవైపు కొర్రీ పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇది నిరంతర ప్రక్రియ, నిర్విరామంగా కొనసాగే ప్రక్రియ అని చెబుతూనే జర్నలిస్టులకు అనేక రకాలుగా అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపుగా ఏడు నెలల సమయం గడిచిపోయినా నేటివరకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయకుండా తాత్సారం చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటో అర్థం కావడం లేదని, మిగతా కార్డులను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని భావిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకం అమలు కావాలన్నా, ఆరోగ్య రీత్యా హెల్త్ కార్డు రావాలన్నా, రవాణా సదుపాయం కల్పించాలన్నా అక్రిడిటేషన్ కార్డు ఒక క్రైటీరియాగా ఉందని, కవరేజీకి వెళ్లే క్రమంలో కార్డులు లేక జర్నలిస్టులు అనేక చోట్ల నుంచి రకరకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఇప్పటికైనా ఇక్కడున్న డీపీఆర్ఓ, అక్రిడిటేషన్ కమిటీ, దాంతోపాటు జిల్లా కలెక్టర్ రాబోయే రెండు,మూడు రోజుల్లో ప్రింటింగ్ దశలో ఉన్నాయని, సాంకేతిక లోపాలని రకరకాలుగా చెప్పి ఆపిన పెండింగ్ కార్డులను పూర్తిచేసి అర్హులైన జర్నలిస్టులందరికీ అందజేయాలని డిమాండ్ చేశారు. మరలా ఇదే కాలయాపన జరిగితే ఊరుకునేదే లేదని, రాష్ట్ర కమిటీతో మాట్లాడి రాష్ట్రవ్యాప్తంగా డీపీఆర్ఓ కార్యాలయాల వద్ద ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఒకవేళ దానికి కూడా స్పందించకపోతే కార్డులు రాని జర్నలిస్టులందరినీ తీసుకొని అవసరమైతే కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష లాంటి కార్యక్రమాలు కూడా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి కి టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ నేతలు వినతిపత్రం అందజేసి పెండింగ్ లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను, కేబుల్ ఛానల్ కు కూడా అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అందుకు స్పందించిన డిఆర్ఓ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు నాగేందర్ రెడ్డి, టీఎస్ చక్రవర్తి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలుబోలు మధుశ్రీ, టీజీసీఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కె. సుధాకర్ (సత్తుపల్లి), ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దగ్గుపాటి మాధవరావు, కొరకొప్పుల రాంబాబు, టీజీజెఏ కెమెరామెన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, గణేష్, యాకూబ్ పాషా, శరత్, అర్షద్, అశోక్, హరి, పవన్, బండి కుమార్ ఖమ్మం టౌన్ రిపోర్టర్లు గోపి, కిరణ్, రవి, సైదులు సత్తుపల్లి రిపోర్టర్లు, ఆనంద్, బాజీ, క్రాంతి, ప్రసాద్, చారి, చంద్రశేఖర్, పాలేరు రిపోర్టర్లు లక్ష్మారెడ్డి, యన్.డి కర్ణ, అచ్యుతరామారావు, వెంకట్, స్వరూప్, రాధాకృష్ణ, గోపి, గంగాధర్, నాగలక్ష్మి, శ్రీదేవి, వైరా రిపోర్టర్లు గుడిమెట్ల మోహన్ రావు, చారి, భూక్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల కోసం చర్చిలకు రూ. 30 వేల ఆర్థిక సహాయం

: జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఈ ఏడాది కూడా క్రిస్మస్ వేడుకలను అత్యంత వైభవంగా, కాంతివంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చర్చిలలో సున్నం వేయడానికి (వైట్ వాష్), విద్యుత్ దీపాలంకరణకు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు ఖమ్మం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం కింద ఖమ్మం జిల్లాలోని అర్హత కలిగిన ప్రతి చర్చికి రూ. 30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించబడుతుందని ఆయన అన్నారు. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం లేదా ట్రస్ట్ చట్టం కింద నమోదై ఉండి, చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, నిర్వహణ కమిటీ కలిగి ఉండి, క్రమం తప్పకుండా ప్రార్థనలు జరుగుతున్న చర్చిలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. అయితే, ఒక్కో చర్చి నుండి ఒక్క దరఖాస్తు మాత్రమే పరిగణించబడుతుందని స్పష్టం చేశారు. అర్హత కలిగిన, నమోదిత చర్చిలన్నీ 23-11-2026 నుండి 30-11-2026 వరకు ఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్ (www.tgobmms.cgg.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు విజయవంతంగా సమర్పించిన తర్వాత, దరఖాస్తుదారులు ఆ ప్రింట్ కాపీకి చర్చి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ నకలు, నిర్వహణ కమిటీ తీర్మానం నకలు, చర్చి బ్యాంక్ పాస్ బుక్ లేదా క్యాన్సిల్డ్ చెక్ నకలు, చర్చి పాస్టర్/అధ్యక్షులు/కార్యదర్శి ఆధార్ కార్డు నకలు, చర్చి యొక్క ఇటీవలి ఫోటోలు, ఈ నిధులను సున్నం వేయడానికి, దీపాలంకరణకు మాత్రమే ఉపయోగిస్తామని తెలిపే అండర్ టేకింగ్ పత్రాలను జతచేసి 30-11-2026 లోపు వివి పాలెంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గల జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. గడువు తర్వాత వచ్చిన, అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణించబడవని స్పష్టం చేశారు. జిల్లాలోని పాస్టర్లు, చర్చి కమిటీ సభ్యులు, క్రైస్తవ సామాజిక నాయకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పండంటి బిడ్డకు జన్మనిచ్చిన మాజీ శాసనసభ్యులు బానోత్.హరిప్రియ నాయక్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎంపీ మాలోత్.కవిత

ఖమ్మం, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :

పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఇల్లందు మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బానోత్.హరిప్రియ నాయక్ ని సోమవారం ఇల్లందులోని ప్రముఖ వైద్యశాల కల్పనా హాస్పిటల్ నందు మాజీ మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా తల్లీ బిడ్డల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని చిన్నారిని ఆశీర్వదించి తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రైల్వే ట్రాక్ మూసివేత సమస్యకు పరిష్కారం..

- ఎంపీ ఈటల రాజేందర్ చొరవతో ప్రజలకు ఊరట



మల్కాజిగిరి, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : గౌతమ్ నగర్ 182వ డివిజన్ పరిధిలోని ఐఎన్ నగర్, బీహార్ బస్తీ ప్రాంతాల ప్రజలు రాకపోకలకు ఉపయోగించే రైల్వే ట్రాక్ మార్గాన్ని రైల్వే అధికారులు మూసివేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక నాయకులు కన్నమళ్ళ నాగరాజ్, రామచంద్ర, కొమురయ్య, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఈసం రాకేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వారు వెంటనే స్పందించి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు సమస్య తీవ్రతను వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎంపీ ఈటల రాజేందర్ వెంటనే స్పందించి రైల్వే డీఆర్ఎంకు ఫోన్ చేసి, రైల్వే ట్రాక్ మార్గం మూసివేత కారణంగా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రైల్వే అధికారులను కోరారు. ఎంపీ చొరవతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో స్థానిక నాయకులు ఈటల రాజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు మనోజ్, సీనియర్ నాయకులు పెంటన్న, గణేష్ యాదవ్, భవాని,స్థానికులు కన్నమళ్ళ నాగరాజ్, రామచందర్ , కొమురయ్య , తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పెండింగ్ అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి.
- ప్రజావాణికి 114 దరఖాస్తులు..
- ప్రతి కుటుంబం ఇందిరమ్మ బీమాకు దరఖాస్తు చేయించాలి.
- అధికారులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశం.



సూర్యాపేట, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్ప నిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిల్లో స్వీకరించే ప్రజావాణి దరఖాస్తులన్నింటినీ తప్ప నిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణి పోర్టల్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, కొత్తగా అందే అర్జీలను ఎప్పటిక ప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రాష్ట్రస్థాయి ప్రజా వాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిం చే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సమ ర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్క రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలను స్థానికంగానే పరిష్కరిస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పు తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19వ తేదీ నుంచి ప్రతిష్ఠా త్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి జిల్లాలోని ప్రతి కుటుంబం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొ త్తం 114 దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిలో భూ సమ స్యలు, రెవెన్యూ శాఖకు సంబంధించి 41, డీఆర్డీఓకు 27, డీపీఓకు 7, మున్సి పాలిటీకి 6, డీడబ్ల్యూఓకు 5, ఇతర వివిధ శాఖలకు సంబంధించి 28 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. అందిన దరఖాస్తులను పరిష్కార నిమిత్తం శాఖల వారీగా పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీపీఓ యాదగిరి, డీఎస్ఓ మోహన్ బాబు, డీఐఈఓ సులోచన రాణి, డీవైఎస్ఓ వెంకటరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద పిల్లలకు స్పాన్సర్‌షిప్ ఆర్థిక సాయం

- అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- డిసెంబర్ 10 సాయంత్రం 5 గంటల వరకు గడువు
- జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ ప్రకటన



రంగారెడ్డి జిల్లా **నవంబరు 24(జర్నలిస్ట్ ఫైల్):** ఆర్థిక ఇబ్బందుల తో చదువుకు దూరమయ్యే పరిస్థితులు ఎదుర్కొంటున్న బాలబాలికలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం స్పాన్సర్‌షిప్ ప్రత్యేక ఆర్థిక సాయం అందించనుంది. ఈ పథకం కింద రంగారెడ్డి జిల్లాలోని 18 సంవత్సరాల లోపు అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ తెలిపారు.జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ పథకా నికి మూడు కేటగిరీలకు చెందిన పిల్లలు అర్హులని ప్రకటిం చారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడు తున్న బాధితుల పిల్లలు,నిరాదరణకు గురైన పిల్లలు ఆర్థిక సమస్యల కారణంగా చదువుకు ఆటంకం కలుగుతు న్నట్లయితే దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.అవసరమైన ధ్రువప త్రాలు దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను జతచేయాలి. మరణ ధ్రువీకరణ పత్రం,ఆరోగ్య సంబంధిత మెడికల్ సర్టి ఫికెట్లు, ఆధార్ కార్డు,రేషన్ కార్డు,పాఠశాల బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో పాటు అర్హతకు సంబంధించిన ఇతర ధ్రువీక రణ పత్రాల ను సమర్పించాలి.జిల్లా బాలల పరిరక్షణ విభాగం కార్యాల యంలో అందుబాటులో ఉండే దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి అందజే యాలి. డిసెంబర్ 10 చివరి గడువు పూర్తి చేసిన దరఖాస్తులను డిసెంబర్ 10, 2026వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రంగారెడ్డి జిల్లా కొంగరక లాన్‌లోని కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మహిళా,శిశు సంక్షే మ శాఖ కార్యాలయంలో సమర్పించాలని అధికా రులు సూచించా రు. అర్హులైన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని నిర్దేశిత గడువులోగా దరఖాస్తులు అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అందించాలి

- క్షేత్రస్థాయిలో నమోదు ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



వికారాబాద్, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. సోమవారం వికారాబాద్ మండలంలోని సిద్ధలూరు, దన్నారం గ్రామాల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద చేపడుతున్న లబ్ధిదారుల నమోదు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ. ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, పథకం ప్రయోజనాలు, నమోదు విధానం, అవసరమైన వివరాలపై అవగాహన కల్పించాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కుటుంబ యజమాని మరణించిన సందర్భాల్లో నామినీల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అనారోగ్యం లేదా ఇతర కారణాలతో నమోదు కేంద్రాలకు రాలేని వారి ఇళ్లకు వెళ్లి నమోదు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బీమా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, పథకంపై లబ్ధిదారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, యువత కూడా బాధ్యతగా ముందుకొచ్చి అర్హులందరూ కుటుంబ జీవిత బీమా పథకంలో నమోదు చేసుకునేలా సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుదీర్, ఎంపీడీవో వినయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మధుకర్ రెడ్డి, సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అంజన్ కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం

- ఘనంగా సత్కరించిన తూంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్
- కట్టమైసమ్మ ఆలయంలో అంజన్ కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు



మేడ్చల్, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : సదర్ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొనేందుకు కరీంనగర్‌కు వెళ్తున్న మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్‌కు సోమవారం తూం కుంటలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా తూంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనం తరం శామీర్‌పేటలోని కట్టమైసమ్మ తల్లి ఆలయంలో అంజన్ కుమార్ యాదవ్ ప్రత్యే క పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భం గా నాయకులు ఆయనకు శుభాకాం క్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొదాని భూ మన్న యాదవ్, మేకల వీరన్న యాదవ్, రవి యాదవ్, గంట రాములు యాదవ్, వెంక టేష్ యాదవ్, బి. పరమేష్, బి. మహే ష్, ఎం. బిక్షపతి, ఏ. శ్రీనివాస్ యాదవ్, ఎం. మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఏసీబీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన

సీనియర్ ఐపీఎస్ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి



హైదరాబాద్, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ అవినీతి నిరోధక శాఖ నూతన డైరెక్టర్‌గా 2004 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి సోమవారం నాడు హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

నిరుపేదలకు ఇళ్ల కేటాయింపులో జాప్యం వద్దు

- పనుల్లో వేగం,నాణ్యత ప్రమాణాలు పెంచాలి
- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్
- లాలాపేట డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే సమీక్ష



సికింద్రాబాద్, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో,సికింద్రాబాద్ నియోజకవర్గంలోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేలా హౌసింగ్ పథకాన్ని చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, మాజీ ఉపసభాపతి తీగుళ్ల పద్మారావు గౌడ్ ఆదేశించారు.సోమవారం లాలాపేటలోని సాయినగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన పరిశీలించి,నిర్మాణ పనులు,లబ్ధిదారుల ఎంపిక,ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు.సుమారు రూ.9 కోట్ల వ్యయంతో వివిధ వర్గాలను ఒప్పించి మూడు అంతస్తుల్లో 104 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించినట్లు తెలిపారు.అయితే ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ కేటాయింపుల్లో జరుగుతున్న జాప్యంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూనే మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.సాయినగర్ డబుల్ బెడ్‌రూం ప్రాజెక్టులో తాగునీరు,రహదారులు,విద్యుత్,డ్రైనేజీ తదితర మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు.లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన నిరుపేదలకు ఇళ్లను కేటాయించాలని స్పష్టం చేశారు.కేటాయింపుల్లో అనవసర జాప్యం జరిగితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన పద్మారావు గౌడ్ వారి సమస్యలు,ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అస్మతుల్లా ఖాన్,డీఈలు లలిత,హేమునాయక్,బీఆర్ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్,ఇతర నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారంపై మియాపూర్ డిప్యూటీ కమిషనర్ సమీక్ష

- అభివృద్ధి పనులు, ఫిర్యాదులు, భూ సేకరణ, అక్రమ భూముల పరిశీలనపై అధికారులకు ఆదేశాలు



శేర్లింగంపల్లి నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : మియాపూర్ సర్కిల్-48 పరిధిలో పెండింగ్ ఫిర్యాదులు, అభివృద్ధి పనులు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన అంశాలపై డిప్యూటీ కమిషనర్ సోమవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైక్యూర్, ట్విట్టర్, ప్రజావాణి, వాట్సాప్ ద్వారా అందిన ఫిర్యాదులతో పాటు పత్రికల్లో వచ్చిన వార్తలపై చర్చించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అమీన్‌పూర్ రహదారి, అల్విన్ చౌరస్తా నుంచి నిజాంపేట్ రహదారి వరకు చేపట్టాల్సిన రహదారి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. తారానగర్‌కు సంబంధించిన పట్టణ ప్రణాళిక అంశాలు, భూసేకరణ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న న్యాయస్థాన కేసులపై చర్చించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాలకు సంబంధించిన సమస్యలు, ఆయా శాఖల సమన్వయం, భవన క్రమబద్ధీకరణ పథకం దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు.అలాగే నిషేధిత భూముల 22 రకాల విభాగాలకు సంబంధించిన సర్వే నంబర్ల పరిశీలన, ధ్రువీకరణ, క్యూర్ చట్టం అమలు, జనగణన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పెండింగ్ అంశాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సహాయ నగర ప్రణాళిక అధికారి, పట్టణ ప్రణాళిక భవన అధికారులు, చిన్నమాన్స్ నాక్ ఇంజినీర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్రమ అండాల సేకరణ కేసులో డాక్టర్ పద్మజ బెయిల్ పిటిషన్ కొట్టివేత

- ఆధారాలు తారుమారావుతాయన్న నేపథ్యంలో పిటిషన్ కొట్టివేత



యాదాద్రి భువనగిరి **నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో మరియు హబ్సిగూడ లో ఉన్న పద్మజ ఫర్టిలిటీ సెంటర్ యజమాని డాక్టర్ పి.పద్మజ , డాక్టర్ దుర్గా రావులకు హైకోర్టులో చుక్కెదురైంది. బేగంపేట పోలీస్ స్టేషన్లో తనపై నమోదైన కేసులో అరెస్టు నుంచి రక్షణ కోరుతూ ఆమె దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సోమవారం విచారించి న్యాయస్థానం కొట్టివేసింది. అయితే , అక్రమంగా అండాల సేకరణ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని డాక్టర్ పద్మజ తన పిటిషన్లో పేర్కొన్నారు. ఈ కేసులో అరెస్టయిన ఓ నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా, విచారణ తర్వాత దశలో తన పేరును నిందితు రాలిగా చేర్చారని ఆమె కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు తాను వైద్య ప్రాక్టీసు నిలిపి వేస్తానని , విచారణ అధికారులకు పూర్తిస్థాయి లో సహకరిస్తానని హామీ ఇస్తూ తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆమె అభ్యర్థించారు.

విద్యార్థుల అభ్యసన సామర్థం పెంపుకు నాణ్యమైన బోధన అందించాలి

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



భద్రాద్రికొత్తగూడెం నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకునాణ్యమైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్‌తెలిపారు. బూర్గంపాడుమండలం మోరంపల్లిబంజర్ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలు సోమవారంఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, డిజిటల్ విద్యా వనరుల వినియోగం, ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్‌విద్యార్థులో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరీక్షించారు. విద్యార్థులు చదువుతున్న పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నల ను అడుగుతూ, వాటికి సమాధానాలు చెప్పాలని సూచించారు. పదోతరగతి సోషల్‌స్టడీస్‌లో గ్లోబలైజేషన్, లిబరలైజేషన్, మల్టీనేషనల్ కంపెనీలు, ఫుడ్ సెక్యూరిటీ వంటిఅంశాలపై విద్యార్థులను ప్రశ్నించారు. ఇంగ్లీషులో నిర్వచనాలు చెప్పడంతో పాటు వాటి అర్థాలను తెలుగులో వివరించాలని, నిత్యజీవితంలో కనిపించే ఉదాహరణలతో పాఠ్యాంశాలను అర్థంచేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు మైండ్‌మ్యాపింగ్ విధానం ద్వారా పాఠ్యాంశాలను బోధించడం, ముఖ్యమైన అంశాలను విద్యార్థులతో సులభంగా గుర్తించి నోట్స్ రాయించడం వంటి బోధనాపద్ధతులను పరిశీలించారు. రాంపూర్‌గ్రామ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన పాఠ్యాంశంపై విద్యార్థులను ప్రశ్నిస్తూ, ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌జిల్లాలో ఉన్న రాంపూర్ గ్రామంలోని వ్యవసాయ, వ్యవసాయేతర కార్యకలాపాలు, పంటల,తలసరి ఆదాయం, విద్య, రవాణాతదితర అంశాలపై వారిఅవగాహనను తెలుసుకున్నారు. రాంపూర్‌గ్రామంలోని వ్యవసాయ విధానాలను బూర్గంపాడుప్రాంతంలోని వరి, మిరప, పత్తి,పామాయిల్ పంటలతో పోల్చి వివిధ అంశాలను వివరించారు. స్థానిక గ్రామంలోని వనరులు, వ్యవసాయ, వ్యవసాయేతర ఉపాధి అవకాశాలను గుర్తించి, వాటిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధిచేసేవిధంగా విద్యార్థులకు అసైన్‌మెంట్లు ఇవ్వాలని సూచించారు.అనంతరం ఖాన్‌అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి డిజిటల్ అభ్యసన వేదికల వినియోగంపై ఉపాధ్యా యులను అడిగి తెలుసుకున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లీష్‌మీడియం విద్యార్థులను ఖాన్‌అకాడమీలో నమోదుచేసినట్లు ఉపాధ్యాయులుకలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలసమయాన్ని కేటాయించి ఖాన్ అకాడమీలోని అభ్యసన లక్ష్యాలు, క్విజ్‌లు పూర్తిచేసేలా ఉపాధ్యాయులుప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు.పాఠశాలలో ఉన్నవీదు ల్యాప్‌టాప్‌లు,ఆరు కంప్యూటర్‌సిస్టమ్‌ల పనితీరుపై ఆరా తీశారు. డివిజటల వనరులను కేవలం అందుబాటులో ఉంచడమే కాకుండా విద్యార్థుల అభ్యసనానికి ఉపయోగపడేలా ప్రతిరోజూ వినియో గించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈతనిఖీలో బూర్గంపాడు డిప్యూటీ తహశీల్దార్‌ధనియా వెంకటేశ్వర్లు, ఎంఈఓ ఏదు సింహరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులుతదితరులు పాల్గన్నారు.

ఖేలో ఇండియా క్రీడలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

● హకీంపేట క్రీడా పాఠశాలలో సన్నాహాలపై సమీక్షించిన కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :

ఎనిమిదో ఖేలో ఇండియా యువజన క్రీడలు–2026 నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలి నేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం హకీంపేటలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలను సందర్శించిన ఆయన క్రీడల నిర్వహణకు చేపడుతున్న సన్నాహాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఖేలో ఇండియా ఉన్నత ప్రదర్శన విభాగం సంచాలకుడు డాక్టర్ పి. రఘుపతిరావు, క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. కల్పన, క్రీడా అధికారి జి. వినోద్ కుమార్‌లతో సమావేశమై ఏర్పాట్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడాకారులకు వసతి, రవాణా తదితర ఏర్పాట్లపై చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సన్నాహక పనుల్లో వేగం పెంచాలని, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని వసతులు సమకూర్చాలని సూచించారు. మౌలిక సదుపాయాలు, వసతి, రవాణా ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, నిర్ణీత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి క్రీడలను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయండి..!

● భాజపా గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, గుగులోతు తిరుపతి నాయక్

షాద్‌నగర్,నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :

ఉమ్మడి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించబోయే ఈ మహత్తర మహా పాదయాత్రలో కార్యకర్తలు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భాజపా గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు తిరుపతి నాయక్ పిలుపునిచ్చారు.ఈ మహా పాదయాత్రలో పాల్గొనడానికి భాజపా జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. జాతీయ నాయకత్వం స్వయంగా పాల్గొంటున్న ఈ పాదయాత్ర కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ బలాన్ని, ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని చాటిచెప్పేలా ఉండాలని అన్నారు.రాజ్యాంగ సంస్థలపై జరుగుతున్న కుట్రలను, అరాచక శక్తుల ప్రచారాన్ని ఈ గడ్డపై నుంచే తిప్పికొట్టేందుకు మనమందరం కదం తొక్కుదామని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం, దేశ సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు.ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, కుటుంబ సభ్యులతో కలిసి కరీంనగర్ చేరుకొని పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని తిరుపతి నాయక్ విజ్ఞప్తి చేశారు.



ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు123 ఫిర్యాదులు స్వీకరణ.. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ మను చౌదరి ఆదేశం

మేడ్చల్, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :

ప్రజావాణికి వచ్చే ప్రజా సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. రెవెన్యూ, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, పౌర సరఫరాలు, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై మొత్తం 123 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజల అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రతి దరఖాస్తుపై క్షుణ్ణంగా విచారణ జరిపి, నిబంధనల మేరకు పరిష్కారం చూపాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులపై చేపట్టిన చర్యలు, పరిష్కార వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో 33 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :

నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క ఎస్.ఐ,సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని,పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా,మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి,పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ,వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా,పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా,శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలియజేశారు.ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నాము అని తెలియజేశారు.

బాలానగర్ ఎస్ఐ నరేందర్ రెడ్డి సేవలపై భాస్కర్ నాయక్ ప్రశంసలు



బాలానగర్, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :

ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా రంగంలోకి దిగి చర్యలు చేపడుతున్న బాలానగర్ ఎస్ఐ నరేందర్ రెడ్డి పనితీరు అభినందనీయమని జడ్చర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జార్పుల భాస్కర్ నాయక్ కొనియాడారు. బాలానగర్ ప్రధాన రహదారులపై వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా ఉన్న కంకర రాళ్లు, ఇతర అడ్డంకులను డోజర్ సహాయంతో ఎస్ఐ పర్యవేక్షణలో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా రహదారులను క్లియర్ చేయడంలో ఎస్ఐ చూపుతున్న చొరవ ప్రశంసనీయమని పేర్కొంటూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న ఎస్సై నరేందర్ రెడ్డికి జార్పుల భాస్కర్ నాయక్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

శివాజీ బీడీ కంపెనీ యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలి



నిజామాబాద్, నవంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :

శివాజీ బీడీ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించి,వెంటనే బ్రాంచ్ లు తెరిచి బీడీ కార్మికులకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నందిపేట మండల కేంద్రంలో భారీ ర్యాలీ,ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ ధర్నాను ఉద్దేశించి తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ....బీడీ కార్మికుల సమస్యలైన పని దినాల పెంపుదల,నెలకు 26 రోజులు పని కల్పించాలని,కానీ కార్మికులకు నెలకు 8 రోజులు మాత్రమే పని ఇవ్వడం వలన బీడీ కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు.యాజమాన్యం పని ఇవ్వని రోజులకు కూలి కట్టి ఇవ్వాలని,1000 బీడీలకు సరిపోయేంత మంచి తునికాకు ఇవ్వాలన్నారు.బీడీలు చాట్ చేసే పద్ధతి మానుకోవాలని,చాట్ చేసిన బీడీలను కార్మికులకె వాపస్ ఇవ్వాలన్నారు.చాట్ చేసిన బీడీలకు కూలి కట్టివ్వాలన్నారు.బ్రాంచీలలో గల నాన్ పిఎఫ్ కార్మికులందరికీ పిఎఫ్ నెంబర్లు ఇవ్వాలనీ,కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్,జిల్లా నాయకులు పి.సాయరెడ్డి,బీడీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కడియపులంక అభివృద్ధికి గట్టి నరసయ్యకు మద్దతివ్వండి



- కూటమి బలపరిచిన జనసేన సర్పంచ్ అభ్యర్థి తరపున మంత్రి కందుల దుర్గేష్ ప్రచారం

రాజమహేంద్రవరం, నవంబర్ 24 (జర్నలిస్ట్ ఫైల్): కడియపులంక గ్రామ సమగ్రాభివృద్ధికి కూటమి బలపరిచిన జనసేన సర్పంచ్ అభ్యర్థి గట్టి నరసయ్యకు మద్దతు ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. మంగళవారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కడియపులంకలో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవంబర్ 26న జరిగే ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి గట్టి నరసయ్యకు కత్తెర గుర్తుపై, 18వ వార్డు అభ్యర్థి సానా రాజుకు గౌను గుర్తుపై ఓటు వేసి నరసయ్య ప్యానెల్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2006లో సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం గట్టి నరసయ్యకు ఉందని, గ్రామ సమస్యల పరిష్కారానికి అవసరమైన నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకునే పరిచయాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేసే నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాబోయే రెండున్నరేళ్లలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరాలంటే గ్రామస్థాయిలో సమర్థవంతమైన పాలన అవసరమని దుర్గేష్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకురావడానికి తాను సహకరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్థులు ప్రస్తావించిన లింక్ రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. అర్హులైన పేదలకు కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

కడియపులంక అభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని మంత్రి తెలిపారు. నవంబర్ 26న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అభ్యర్థుల పనితీరు, గ్రామాభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

గుంటూరులో ఆదర్శంగా నిలుస్తున్న మ్యాంగో స్ట్రీట్



- ఇలాంటి వందలాది వీధులు అభివృద్ధి చెందాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): నగరంలో ఐక్యత, పచ్చదనం, పారిశుధ్యానికి ప్రతీకగా మ్యాంగో స్ట్రీట్ నిలుస్తోందని, ఇలాంటి వందలాది వీధులు గుంటూరులో రూపుదిద్దుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు.

మంగళవారం జేకేసీ రోడ్డులోని 54వ డివిజన్ మ్యాంగో స్ట్రీట్, ఎస్.వి.ఎన్. కాలనీలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధిలో ఏ కార్యక్రమం నిర్వహించినా స్థానికులు గ్రూపులుగా విడిపోకుండా ఒకే కుటుంబంలా ఐక్యంగా పాల్గొనడం అభినందనీయమన్నారు.

పచ్చదనం పెంపొందించడంతో పాటు పారిశుధ్యం, చెత్త సేకరణ, స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించడం ఇతర ప్రాంతాలకు ఆదర్శమని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ గుంటూరు కార్యక్రమాల్లో భాగంగా మ్యాంగో స్ట్రీట్‌ను ఆదర్శ ప్రాంతంగా గుర్తించడం సంతోషకరమన్నారు. ఇక్కడి యువత, పెద్దలు ఇతర వీధులకు వెళ్లి పచ్చదనం, పారిశుధ్యం, సామాజిక బాధ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ నగర అభివృద్ధి, పారిశుధ్యానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రామకృష్ణ వంటి పెద్దల సహకారం, స్థానికుల భాగస్వామ్యంతో గుంటూరును మరింత అభివృద్ధి చేయవచ్చన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే నగర అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు.

ఇటీవల ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని గళ్ళా మాధవి కోరారు. ఎలాంటి ప్రలోభాలు, ప్రత్యేక ఏర్పాట్ల కోసం ఎదురుచూడకుండా స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని సూచించారు. ప్రజల్లో సామాజిక బాధ్యత, చైతన్యం పెరిగినప్పుడే మ్యాంగో స్ట్రీట్ తరహాలో గుంటూరులో మరిన్ని ఆదర్శ వీధులు ఏర్పడతాయని అన్నారు.

ఈవీఎంలైనా, బ్యాలెట్ లైనా గెలుపు కూటమిదే : ఎమ్మెల్యే నసీర్

- రాష్ట్రంలో వైసీపీ అడ్రస్ గల్లంతే..
- స్థానిక ఎన్నికల్లో 94 శాతం కూటమిదే స్ట్రైక్ రేట్
- పంచాయతీ ఎన్నికల్లోనూ 100 శాతం విజయాలు
- బీసీలకు రాజకీయ ప్రాధాన్యమిచ్చింది కూటమిదే
- పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ తో రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్
- రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా మార్చడమే ధ్యేయం
- జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, తిరుపతిరావుతో కలిసి మీడియా సమావేశం



గుంటూరు, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): ఇది డబుల్ ఇంజన్ సర్కారు కాదని.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో కూడి ట్రిపుల్ ఇంజన్ సర్కార్ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బాగా బుద్ధి చెప్పారని చెప్పారు. గతంలో ఈవీఎంలపై తమ ఓటమి నెపాన్ని నెట్టిన వైసీపీ .. ఇప్పుడు బ్యాలెట్ పోరులోనూ బొక్కా బోర్లా పడిందని తెలిపారు. ఇప్పుడు ఫలితాలను చూసి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సోషల్ ఇంజనీరింగ్ పేరిట జగన్ హయాంలో బీసీల రిజర్వేషన్ ను 24 శాతానికి తగ్గించి 16,800 మందికి రాజ్యాంగ పదవులు రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. కోర్టులో బీసీల రిజర్వేషన్లపై అడ్డంకులు ఎదురైనప్పటికీ టీడీపీ 34 శాతం అభ్యర్థులకు టికెట్లు ఇచ్చిందనన్నారు. అదే సమయంలో విద్యావంతులతోపాటు మహిళలకు 50 శాతం టికెట్లు అందించి గౌరవించినట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లోనూ గ్రామీణ ప్రజలు కూటమికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలను సైతం అధిగమించి ప్రజలకు మంచి చేస్తున్నారని చెప్పారు. ఎల్ నినోతోపాటు రెండు తుఫాన్ల సమయంలోనూ ప్రజలకు కూటమి అండగా నిలిచిందన్నారు. ఐక్యతకు మారుపేరు కూటమి నాయకత్వమని, అందుకే ప్రత్యర్థి పార్టీ రాష్ట్రంలో అడ్రస్ గల్లంతు అవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కేవలం అక్షర క్రమంలోనే కాదు.. అభివృద్ధిలోనూ నంబర్ వన్ స్థానంలో నిలవబోతోందని, రాష్ట్రానికి స్వర్ణయుగం రాబోతోందని చెప్పారు. జగన్ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజల ఛీకొట్టారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అమరావతి రాజధాని నిర్మాణం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు పరుగులు తీస్తున్నాయని తెలిపారు. యువత భవితను బంగారుమయం చేసేందుకుగాను రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల్లో 17 వేల మంది వైసీపీ తరఫున పోటీలో నిలిచారని, అయితే ప్రజలు కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్ తో విజయాన్ని అందించారని తెలిపారు. తల్లికి వందనం, దీపం పథకం, స్త్రీశక్తి పథకం వంటి కార్యక్రమాలతో పేదలకు సంక్షేమాన్ని అందించామన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలనతో పంచాయతీలకు మహర్దశ వచ్చిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తున్నామని తెలిపారు.

సంక్షేమ హాస్టళ్ల ఆధునికీకరణ పూర్తి చేయాలి

- మార్పు పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ



గుంటూరు, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల రూపురేఖలను మార్చి, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన 'మార్పు' పథకం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.

మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో 'మార్పు' పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోవు డిసెంబర్ చివరి నాటికి హాస్టళ్ల ఆధునికీకరణ పనులకు సంబంధించి అవసరమైన అన్ని ఆర్థికపరమైన అనుమతులు పొందాలని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి జిల్లాలో గుర్తించిన సంక్షేమ హాస్టళ్లలో ఆధునిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు గ్రే వాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సోక్ పిట్స్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. వ్యర్థ జలాల నిర్వహణ, ఘన వ్యర్థాల సక్రమ పారవేతకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పచ్చదనం పెంపులో భాగంగా హాస్టళ్ల ప్రాంగణాల్లో హెర్బల్ గార్డెన్స్, దోమల నివారణకు ఉపయోగపడే మస్కిటో రిపెల్లెంట్ గార్డెన్స్ ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన గార్డెన్స్ నిరంతరం నిర్వహణలో ఉండేలా వెంటనే మంచినీటి ట్యాప్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. 'మార్పు' పథకం లక్ష్యాలకు అనుగుణంగా అన్ని పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో సీపీఓ లక్ష్మి కుమారి, డ్వామా పీడీ శంకర్, పంచాయతీరాజ్ , ఆర్ అండ్ బి ఎస్ ఈ లు అశోక్, శ్రీనివాసమూర్తి, జిల్లా సాంఖిక సంక్షేమ అధికారి హరిత, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి దుర్గాభాయి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి మయూరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పిఈడబ్ల్యూఫ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ దంపతుల షష్టిపూర్తి మహోత్సవం



తెనాలి, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర పదుశాలీయ ఉద్యోగుల సంక్షేమ సంఘం (పిఈడబ్ల్యూఏ) రాష్ట్ర అధ్యక్షులు, అంగలకుదురు జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు గుద్దంటి వెంకట శివరామకృష్ణ, ఛాయాదేవి దంపతుల షష్టిపూర్తి మహోత్సవం మంగళవారం గుంటూరు జిల్లా తెనాలిలోని రామలింగేశ్వరపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు పదుశాలీయ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెనాలి డివిజన్ ఉపాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గ ఆలయ పాలకమండలి సభ్యులు జి. శివనాగేశ్వరరావుతో పాటు పలువురు సహచర ఉపాధ్యాయులు, సంఘ నాయకులు హాజరయ్యారు. రామకృష్ణ, ఛాయాదేవి దంపతులకు షష్టిపూర్తి శుభాకాంక్షలు తెలియజేసి, ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు, పదుశాలీయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రామకృష్ణ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సామాజిక, సంఘ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మరిన్ని విజయాలు సాధించాలని, భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమానికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షులు, ఓంకార్ గ్రాఫిక్స్ అధినేత కటకం వెంకట్‌ప్రసాద్, పట్టణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తిరువీధుల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బిత్రా వెంకట సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి పడవల శివయ్య, ఉపాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, కందుల శ్రీనివాసరావు, మాచర్ల శ్రీనివాసమూర్తి, కాజ నారాయణరావు, ఆరికాటి బాలసుబ్రహ్మణ్యం, గొట్టుముక్కల సుబ్బారావు, మాచర్ల శివప్రసాద్, కోర్నిపాటి నారాయణ, చిట్యాల జ్యోతి రమేష్, త్రివీధి రమేష్, గౌతమ్ రామచంద్రరావు, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

25, 28, 30 తేదీల్లో అభ్యర్థుల వ్యయాల పరిశీలన

గుంటూరు, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): గ్రామ పంచాయతీ ఎన్నికల రెండవ దశలో పోటీ చేస్తున్న అభ్యర్థుల వ్యయ ఖాతాలను ఈ నెల 25,28,30 తేదీల్లో పరిశీలించడం జరుగుతుందని జిల్లా నోడల్ అధికారి మరియు జిల్లా ఆడిట్ అధికారి ఎస్ శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల తమ రిటర్నింగ్ అధికారుల పరిధిలో ఉన్న సహాయ వ్యయ పరిశీలకుల వద్ద తమ ఖాతాలను సమర్పించాలని చెప్పారు. అభ్యర్థుల ఖాతాలను క్షుణ్ణంగా విచారణ చేయాలని జిల్లా వ్యయ పరిశీలకులు నందిని సలారియా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలను సహాయ వ్యయ పరిశీలకులకు అందజేయాలని అన్నారు.

నవంబరు 28, డిసెంబరు 1,3 తేదీల్లో మూడవ దశ అభ్యర్థుల వ్యయాల పరిశీలన

గ్రామ పంచాయతీ ఎన్నికల మూడవ దశలో పోటీ చేస్తున్న అభ్యర్థుల వ్యయ ఖాతాలను నవంబరు 28, డిసెంబరు 1,3 తేదీల్లో పరిశీలించడం జరుగుతుందని చెప్పారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు



- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌పై నిఘా
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): కార్తీక పౌర్ణమి సందర్భంగా పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంతో పాటు గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రముఖ, పురాతన శివాలయాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడటం, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు.

కార్తీక మాసం, కార్తీక పౌర్ణమి నేపథ్యంలో పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో పెదకాకాని పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా తుళ్లూరు మండలంలోని తాళ్లాయపాలెం శివాలయం, తెనాలి రూరల్ పరిధిలోని సోమేశ్వరాలయం, తాడేపల్లి కృష్ణానది పరివాహక ప్రాంతంతో పాటు జిల్లాలోని ఇతర ముఖ్యమైన శివాలయాల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు పోలీస్ సిబ్బందిని మోహరించారు.

దేవస్థానాలకు వచ్చే భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించడం, వాహనాల పార్కింగ్‌ను పర్యవేక్షించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

వరల్డ్ మేయర్స్ ఫోరం-2026లో పాల్గొననున్న గుంటూరు మేయర్, కమిషనర్

గుంటూరు, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): ముంబైలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న మూడో వరల్డ్ మేయర్స్ ఫోరం–2026లో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ పాల్గొననున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పురపాలక పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ముంబైలోని ఫెయిర్‌మాంట్ హోటల్‌లో ఈ అంతర్జాతీయ సమావేశం నిర్వహించనున్నారు.

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ ఫోరాన్ని నిర్వహిస్తున్నారు. 1926లో స్థాపించిన ఈ సంస్థ స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయడంలో శిక్షణ, పరిశోధన, సంస్థాగత అభివృద్ధి, పట్టణ పాలన రంగాల్లో వందేళ్లుగా సేవలందిస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణాభివృద్ధిలో మహిళా నాయకత్వం, లింగ సమానత్వం, ఆర్థిక చేరిక, వృత్తిపరమైన శిక్షణ, సామర్థ్య నిర్మాణం, సమర్థవంతమైన పట్టణ పాలన వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు.

ఈ ఫోరంలో దేశ, విదేశాలకు చెందిన మేయర్లు, నగర నాయకులు, విధాన రూపకర్తలు, విద్యావేత్తలు, పట్టణాభివృద్ధి నిపుణులు, అభివృద్ధి భాగస్వాములు సహా 1,000 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారని అంచనా. నవంబర్ 27న పట్టణాభివృద్ధిలో మహిళా నాయకత్వం, లింగ సమానత్వం, ఆర్థిక చేరిక అంశాలపై ప్రత్యేక మహిళా నాయకత్వ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 25 మంది మేయర్లు, చైర్‌పర్సన్లు, మున్సిపల్ కమిషనర్లను ఈ సమావేశంలో పాల్గొనేందుకు పురపాలక పరిపాలన శాఖ నామినేట్ చేసింది. ఈ అంతర్జాతీయ వేదిక ద్వారా పట్టణాభివృద్ధిలో అనుసరిస్తున్న విధానాలు, నూతన ఆలోచనలు, ఉత్తమ పద్ధతులపై అవగాహన పొందే అవకాశం కలగనుంది.

స్థానిక సంస్థల ఎన్నికల భద్రతకు 'సమర్థా' మొబైల్ యాప్

- పోలీస్ బలగాల సమన్వయం, సమస్యాత్మక ప్రాంతాల పర్యవేక్షణకు ప్రత్యేక సాంకేతిక పరిష్కారం
- గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీస్ బలగాల సమన్వయం, ఎన్నికల విధుల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ 'సమర్థా' (SAMARTH -- Security Arrangement Mapping Analysis Response Tracking Hub) మొబైల్ యాప్‌ను రూపొందించింది. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఈ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించారు.

తాడేపల్లి–మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్, పొన్నూరు మున్సిపాలిటీల్లో జరగనున్న ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల సమస్యలను ముందుగానే గుర్తించడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించడం, పోలీస్ బలగాలను సమన్వయంతో వినియోగించడం ఈ యాప్ ప్రధాన లక్ష్యం. ఈ యాప్‌ను పోలీస్ అధికారులు, సిబ్బంది తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించే విధానం, అందులోని సదుపాయాలపై ఐటీ కోర్ సీఐ నిషార్ భాషా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు.

యాప్‌తో కీలక ప్రయోజనాలు: ఎన్నికల సమయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు వేగంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టేందుకు 'సమర్థా' యాప్ ఉపయోగపడుతుంది. గూగుల్ మ్యాప్స్ ద్వారా పోలీస్ అధికారులు, సిబ్బంది స్థానాలను కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించవచ్చు. సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాల లొకేషన్లను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టేందుకు వీలుంటుంది.

అత్యవసర పరిస్థితుల్లో మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను సమస్యాత్మక ప్రాంతాలకు వేగంగా తరలించవచ్చు. ఒకే నోటిఫికేషన్ ద్వారా జిల్లాలోని సుమారు 2,000 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ఒకేసారి సమాచారం, ఆదేశాలు చేరవేసే సదుపాయం కూడా ఇందులో ఉంది.

యాప్‌లో అందుబాటులో ఉండే పోలీస్ అధికారుల వివరాలు, మొబైల్ నంబర్ల ద్వారా సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించవచ్చు. ఇంటర్నెట్ సిగ్నల్ అందుబాటులో లేని పరిస్థితుల్లోనూ నోటిఫికేషన్ల ద్వారా సమాచారం చేరవేసే సదుపాయం ఉందని ఎస్పీ తెలిపారు. అయితే ఈ సదుపాయం నెట్‌వర్క్ పరిస్థితులపై ఆధారపడి పనిచేస్తుంది.

SOSతో తక్షణ స్పందన: అత్యవసర పరిస్థితుల్లో యాప్‌లోని SOS బటన్‌ను నొక్కితే సంబంధిత సమాచారం కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. దీంతో మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. కంట్రోల్ రూమ్‌కు నేరుగా కాల్ చేసి అత్యవసర పరిస్థితులను తెలియజేసే సదుపాయం కూడా ఉంది. ఎన్నికల సమయంలో పోలీస్ బలగాల సమర్థవంతమైన వినియోగం, సమస్యాత్మక ప్రాంతాల పర్యవేక్షణ, సమాచార మార్పిడి, ఫిర్యాదుల పరిష్కార పర్యవేక్షణలో 'సమర్థా' కీలక పాత్ర పోషిస్తుందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ ఈ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడమే ఈ యాప్ ప్రధాన ఉద్దేశమని ఎస్పీ స్పష్టం చేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతుల సమస్యలు పరిష్కరించాలి



- సీడీఎంఏతో చర్చించిన ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్

విజయవాడ, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులు, ప్రొబేషన్ డిక్లరేషన్ తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ సీడీఎంఏ అధికారులను కోరారు. మంగళవారం సీడీఎంఏను కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేసి చర్చించారు. డేటా ప్రాసెసింగ్ కార్యదర్శుల పదోన్నతులకు సంబంధించి గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించిన వినతిపై సీడీఎంఏ కార్యాలయానికి వచ్చిన వివరణాత్మక ఫైలును పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

వార్డు వెల్ఫేర్ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించే అంశాన్ని కూడా నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పదోన్నతుల ప్రక్రియను చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సీడీఎంఏ హామీ ఇచ్చినట్లు తెలిపారు. జీవో నంబర్ 244 అమలులో జాప్యం, ఆర్థిక శాఖ, సాధారణ పరిపాలన శాఖల పరంగా ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను విద్యాసాగర్ వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీలైనంత త్వరగా పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేస్తామని సీడీఎంఏ తెలిపినట్లు పేర్కొన్నారు.

కోర్టు ఉత్తర్వుల ద్వారా నియమితులైన బీకామ్ విద్యార్హత కలిగిన వార్డు వెల్ఫేర్ కార్యదర్శుల పెండింగ్ ప్రొబేషన్ డిక్లరేషన్ అంశాన్ని కూడా చర్చించారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు వెల్లడించారు. పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేసేందుకు అవసరమైతే ఆర్థిక, సాధారణ పరిపాలన శాఖలతో చర్చల్లో సంఘం తరఫున సహకరిస్తామని విద్యాసాగర్ తెలిపారు.

ఈ చర్చల్లో ఏపీఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్ జానీ పాషా, రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, విజయవాడ నగర శాఖ అధ్యక్షుడు నీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అభివృద్ధిపై బీజేపీ ప్రత్యేక దృష్టి



- మేయర్ అభ్యర్థి రేలంగి రాణి శ్రీదేవి తరపున కిలారు దిలీప్ విస్తృత ప్రచారం

రాజమహేంద్రవరం, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్ రాజమహేంద్రవరంలో పర్యటించారు. బీజేపీ మేయర్ అభ్యర్థి రేలంగి రాణి శ్రీదేవి తరపున నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలను నేరుగా కలుసుకుని నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాజమహేంద్రవరంలో రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నగర భవిష్యత్తు అభివృద్ధికి బీజేపీ రూపొందించిన ప్రాధాన్యతలను ప్రజలకు వివరించారు.

నగర ప్రజల నుంచి పార్టీకి మంచి స్పందన లభిస్తోందని కిలారు దిలీప్ తెలిపారు. ప్రచార కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మేయర్ అభ్యర్థి, కార్పొరేటర్ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో భాగస్వాములయ్యారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ, ప్రాణ భద్రత కల్పించాలి

విజయవాడ, నవంబర్ 24 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ న్యాయం చేయాలని ఏపీఎస్ఆర్టీసీ (పీటీడీ) ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి టి. గంగాంజనేయులు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి డిపో గ్యారేజీలో జరిగిన బస్సు ప్రమాదంలో ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు భారతి (33) మృతి చెందడం, మరో ఇద్దరు కార్మికులు ఇస్మాయిల్ (23), సుధాకర్ (42) తీవ్రంగా గాయపడటం పట్ల వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్కింగ్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో అర్హత లేని శ్రామిక మెకానిక్‌తో బస్సు నడిపించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. మృతురాలు భారతి వైఎస్ఆర్ కడప జిల్లా వీరబల్లి మండలం వంగిమళ్ల పెద్ద హరిజనవాడకు చెందినవారని, భర్త పదేళ్ల క్రితమే మరణించడంతో ఇద్దరు కుమారులను పోషించేందుకు వాషింగ్ ప్లాంట్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. ఆమె మరణంతో పిల్లలు తల్లిని కోల్పోయారని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారతి కుటుంబానికి రూ. 30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, బీమా ప్రయోజనాలను వెంటనే అందించాలని, ఇద్దరు కుమారుల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో గాయపడిన ఇస్మాయిల్, సుధాకర్‌లకు పూర్తిగా ఉచిత వైద్యం అందించి, కోలుకునే వరకు పూర్తి వేతనం చెల్లించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోలు, గ్యారేజీలు, వర్క్‌షాప్‌లు, బస్టాండ్లలో భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, అర్హత, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారితో బస్సులు నడిపించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాత్రి విధుల్లో పనిచేసే కార్మికులకు ప్రత్యేక భద్రతా చర్యలు, వైద్య సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 8,500 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ జీవిత బీమా, ఈఎస్ఐ, పీఎఫ్, ఆర్టీసీ వైద్య సదుపాయం, ఉచిత బస్సు పాస్ అమలు చేయాలని యూనియన్ నాయకులు కోరారు. కార్మికులకు ప్రాణ భద్రత, ఉద్యోగ భద్రతతో పాటు గౌరవప్రదమైన వేతనాలు కల్పించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. భారతి మృతికి రాష్ట్ర కమిటీ సంతాపం తెలియజేస్తూ, ఆమె కుటుంబానికి అండగా నిలుస్తామని ప్రకటించారు.

రాజమహేంద్రవరం అభివృద్ధికి కూటమికే పట్టం కట్టండి

- 18, 25, 52 వార్డుల్లో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఎన్నికల ప్రచారం
- తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం



రాజమహేంద్రవరం, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): రాజమహేంద్రవరం నగర సమగ్రాభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రజలను కోరారు. మంగళవారం నగరంలోని 18, 25, 52 వార్డుల్లో కూటమి అభ్యర్థులు సూరపురెడ్డి జానకిరామయ్య (టీడీపీ), కొల్లి లారెన్స్ రత్నకుమారి (జనసేన), చిక్కాల రామసీత (టీడీపీ) తరఫున స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)తో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ప్రజలు మంగళహారతులు, పూలవర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నవంబర్ 26న జరిగే ఎన్నికల్లో సైకిల్, గాజు గ్లాసు, కమలం గుర్తులపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీజేపీ మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవిని కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం-2 వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. కొత్తరేషన్‌కార్డులు, నూతన పెన్షన్లు, పేదల గృహ నిర్మాణం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయడానికి స్థానిక సంస్థల్లోనూ కూటమి బలపడాలని అన్నారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నగర అభివృద్ధిని పట్టించుకోని నాయకులు ఇప్పుడు ప్రజలను ఓట్లు ఎలా అడుగుతున్నారని దుర్గేష్ ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించని వారికి ఓటు వేస్తే ప్రయోజనం ఉండదన్నారు. నగరంలోని తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు జల్ జీవన్ మిషన్, అమృత్ పథకాల ద్వారా శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. విలీన గ్రామాలను కూడా నగరంతో సమానంగా అభివృద్ధి చేస్తామని, కూటమి కార్పొరేటర్లను గెలిపిస్తే నగరాభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

కూటమి పొత్తులో భాగంగా సీట్లు దక్కకపోయినా ఇతర పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తల త్యాగాన్ని మంత్రి అభినందించారు. చిన్నపాటి విభేదాలను పక్కనపెట్టి సమైక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నవంబర్ 26న జరిగే పోలింగ్‌లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తను తయారు చేయడమే చంద్రబాబు లక్ష్యం

- ప్రతి గల్లీలో గూండాలను తయారు చేయాలన్నదే జగన్ అజెండా: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



మంగళగిరి, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని, ప్రతి గల్లీలో ఒక గూండాను తయారు చేయాలన్నదే జగన్ అజెండా అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి విమర్శించారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా బలోపేతమై సంతోషంగా జీవించాలన్నదే చంద్రబాబు లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా పేదలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. సాధారణ సామాజిక భద్రతా పెన్షన్లను రూ. 4,000కు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ. 6,000కు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ. 15,000కు, దివ్యాంగులకు రూ. 10,000 వరకు పెంచినట్లు వివరించారు. కిడ్నీ, తలసేమియా బాధితులతో పాటు మత్స్యకారులు, చేనేత, కల్లుగీత కార్మికులకు కూడా ప్రత్యేక పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. రానున్న ఐదేళ్లలో పెన్షన్ల కోసం సుమారు రూ. 1.70 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లు అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సంక్షేమం అంటే ఓట్ల కోసం చేసే మ్యాజిక్ కాదని, పేదల ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.

సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గళ్ళా మాధవి తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రజల ఆరోగ్యం కోసం సంజీవని కార్యక్రమం, పేదరిక నిర్మూలన కోసం పి4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలు, వివక్షతో అర్హులైన వారికి పెన్షన్లు తొలగించారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు.

2029లో తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను అదే స్థాయిలో కొనసాగించే ధైర్యం ఉందా అని గళ్ళా మాధవి సవాల్ విసిరారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, అనారోగ్య బాధితులకు ప్రస్తుతం అందుతున్న పెన్షన్లను యథాతథంగా కొనసాగించగలరా అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని, రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

హే రామ్!" అంటూ జగన్మోహన్ రెడ్డి మొసలి కన్నీరు

- అభయ ఆంజనేయస్వామి ఆలయ తరలింపు ఒప్పందం
- ఆయన హయాంలోనే బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ

అమరావతి, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఆంజనేయపురంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయ తరలింపుపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ విమర్శించారు. ఆలయాలను రక్షించాలంటూ సోషల్ మీడియాలో 'హే రామ్' అని వ్యాఖ్యానించడం మొసలి కన్నీరు కార్చడమేనని అన్నారు. ఆలయ తరలింపునకు సంబంధించిన భూసేకరణ, ఒప్పంద ప్రక్రియ 2022-23లో జగన్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, అప్పట్లోనే ఆలయ ఈవో ఖాతాలో రూ. 59.30 లక్షల నష్టపరిహారం జమ అయినట్లు పేర్కొన్నారు. నాడు జరిగిన ఒప్పందాలపై సమాధానం చెప్పకుండా ప్రస్తుత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

అభయ ఆంజనేయస్వామి ఆలయం పల్లవుల కాలం నాటిదన్న ప్రచారంలో వాస్తవం లేదని, సుమారు 60-70 ఏళ్ల క్రితం గ్రామస్థులు నిర్మించుకున్న ఆలయమని అర్చకులు తెలిపినట్లు యామిని శర్మ పేర్కొన్నారు. గర్భగుడికి ఎలాంటి నష్టం జరగలేదని వివరించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆలయానికి సమీపంలో 50 సెంట్ల ప్రత్యామ్నాయ స్థలం కేటాయించారని, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పర్యవేక్షణలో వేద పండితుల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం బాలాలయం నిర్మించి, విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించిన తర్వాతే పాత నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అంతర్వేది రథం దగ్ధం, రామతీర్థంలో కోదండరాముని విగ్రహం ధ్వంసం, దుర్గగుడి వెండి సింహాల మాయం వంటి ఘటనలు జరిగినప్పుడు జగన్ ఎందుకు స్పందించలేదని ఆమె ప్రశ్నించారు. దేవాలయాల భూములు, దేవాదాయ శాఖ నిధులు, అర్చకుల సమస్యలపై అప్పట్లో పట్టించుకోని వారు ఇప్పుడు ఆలయాల పరిరక్షణ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

గ్రామస్థుల సమ్మతితో, ఆగమ శాస్త్ర సంప్రదాయాల ప్రకారం జరుగుతున్న ఆలయ పునర్నిర్మాణంపై తప్పుడు ప్రచారం చేస్తూ మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నించవద్దని యామిని శర్మ హెచ్చరించారు. ఆలయ తరలింపుపై ప్రజలకు వాస్తవాలు వివరించాలని, వైఎస్ జగన్, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్ఎంసీ ప్రమాణాల అమలులో నిర్లక్ష్యానికి తావులేదు

- వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లకు డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ స్పష్టమైన ఆదేశాలు



విజయవాడ, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల్లో జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిర్దేశించిన ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ విష్ణువర్ధన్ స్పష్టం చేశారు. కళాశాలల్లో బోధనా సిబ్బంది అందుబాటు నుంచి ఆసుపత్రుల్లో రోగులకు అందించే వైద్య సేవలు, పడకల వినియోగం, మౌలిక సదుపాయాలు, వైద్య రికార్డుల నిర్వహణ వరకు ప్రతి అంశం ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు తమ పనితీరుకు పూర్తి బాధ్యత వహించాలని సూచించారు. ఈ మేరకు విజయవాడలోని వైద్య విద్యా డైరెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల వర్క్‌షాప్‌లో తొలిరోజు 7 జిల్లాల వైద్యకళాశాలలు, బోధనా ఆసుపత్రుల పనితీరును సమీక్షించారు. శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ, తూర్పుగోదావరి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు తమ సంస్థల్లోని పరిస్థితులు, సమస్యలు, చేపట్టిన అభివృద్ధి చర్యలను ప్రజెంటేషన్ల ద్వారా వివరించారు.

ర్యాగింగ్ విషయంలో ఉపేక్షించేది లేదు

ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండే మందులకు సంబంధించి ప్రతిరోజూ సమీక్షించాలన్నారు, సిడియస్ లో లేని మందులను ఆసుపత్రుల సూపరింటెండెంట్లు స్థానికంగా కొనుగోలు(లోకల్ పర్చేజ్) చేసుకోవాలని సూచించారు. మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ జరగకకుండా చర్యలు తీసుకోవాలని, యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్లతో నిరంతరం పర్యవేక్షిస్తూ ర్యాగింగ్‌ను అరికట్టాలని సూచించారు. ర్యాగింగ్ విషయంలో ఏమాత్రం ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు.

ప్రతి రోగి వైద్య వివరాలు డిజిటల్ రికార్డుల్లో ఉండాలి

ఓపీ, ఐపీ విభాగాలకు వచ్చే ప్రతి రోగికి ఆభా గుర్తింపు సంఖ్య సృష్టించి వైద్య రికార్డులతో అనుసంధానించాలని ఆదేశించారు. ఇన్‌పేషెంట్ విభాగాల్లో ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు రోగుల వ్యాధి నిర్ధారణ వివరాలు, ఆభా గుర్తింపు సంఖ్యలతో ప్రధాన రిజిస్టర్ నిర్వహించాలి. సంబంధిత వైద్య బోధకులతో ఆ వివరాలను ధ్రువీకరించాలి. ఓపీ సేవలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సీటీ, ఎంఆర్ఐ, ప్రయోగశాల పరీక్షల సంఖ్య ఎన్ఎంసీ నిర్దేశించిన ప్రమాణాలకు తగ్గకుండా ఉండేలా చూడాలని సూచించారు.

వైద్య సేవల నుంచి సిబ్బంది హాజరు వరకు నిరంతర నిఘా : ప్రమాద బాధితుల వివరాల నమోదు వ్యవస్థ (ట్రామా రిజిస్ట్రీ)ని పకడ్బందీగా అమలు చేయాలి. ఓపీ, ఐపీ సేవలు, ముఖ గుర్తింపు హాజరు విధానం (ఎఫ్ఆర్ఎస్), శస్త్రచికిత్సలు, ఎన్ఎంసీ ఏఈబీఏఎస్ హాజరును నిరంతరం పర్యవేక్షించాలని సూపరింటెండెంట్లకు సూచించారు. వైద్యపరికరాల మరమ్మతులు, వెంటిలేటర్లు, పని కేంద్రాలు, అత్యవసర చికిత్స విభాగాలకు అవసరమైన ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా సమర్పించాలన్నారు. వైద్య విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, శుద్ధి చేసిన తాగునీటి సదుపాయాలు కల్పించాలి. ర్యాగింగ్ నిరోధక కమిటీలను బలోపేతం చేయాలి. ప్రమాద చికిత్స విభాగాలు, ప్రసవ గదులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. విద్యార్థుల్లో పరిశోధనలను ప్రోత్సహించాలి. ఆసుపత్రుల పరిసరాల్లో పారిశుద్ధ్యం, భద్రత, పురుగుల నివారణ చర్యలపై కఠిన పర్యవేక్షణ ఉండాలి. ప్రమాద చికిత్స విభాగాల్లో చక్రాల కుర్చీలు, స్ట్రెచర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రుల నిర్వహణలో అవినీతికి ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదని డీఎంఈ స్పష్టం చేశారు. ముందస్తు క్యాన్సర్ గుర్తింపు విభాగాల నుంచి మెరుగైన వైద్యం కోసం పంపించే రోగులకు ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించాలని సూచించారు. కార్యాలయ నిర్వహణ, ఆర్థిక నిబంధనలు, నియామకాలు, రిజర్వేషన్లు, సెలవుల నిబంధనలు, మౌలిక సదుపాయాల నిర్వహణపై జాయింట్ డైరెక్టర్లు కర్రి అప్పారావు, గణపతిరావు వివరించారు. వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల్లో చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిని ఏపీఎంఎస్ఐడీసీ ముఖ్య ఇంజినీర్ బలరామిరెడ్డి సమీక్షించారు. అడిషనల్ డైరెక్టర్(మెడికల్ ఎడ్యుకేషన్)డాక్టర్ రాధికారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బుధవారం జరిగే రెండో రోజు వర్క్‌షాప్‌లో మచిలీపట్నం, కృష్ణా, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, కడప జిల్లాలకు చెందిన వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు పాల్గొంటారు.

గంజాయి, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌కు విద్యార్థులు భాగస్వాములు కావాలి



- మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

గుంటూరు, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): గంజాయి, మాదక ద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని గుంటూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (వీవీఐటీయూ)లో ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసులు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, సామాజిక పరిణామాలు, చట్టపరమైన చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. మద్యపానం, మత్తు పదార్థాలకు బానిసైన వారు గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడంలో విద్యార్థులు, యువత సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని పేర్కొన్నారు.

ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ లేదా అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ప్రభుత్వ టోల్‌ఫ్రీ నంబర్ 14405కు ఫోన్ చేసి తెలియజేయాలని అధికారులు కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి. అరుణకుమారి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇ. మరియ బాబు, గుంటూరు-1 ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె. రవికుమార్, వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుర్రిపాలెంలో కూటమి విజయదుందుబి



- సర్పంచ్‌గా జెట్టి భారతి ఏకగ్రీవ ఎన్నిక.. ఉపసర్పంచ్‌గా పరుచూరి రాంబాబు
- 12 వార్డుల్లో టీడీపీకి 8, జనసేనకు 3.. వైసీపీకి ఒక వార్డు

తెనాలి, నవంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్): మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. గ్రామ సర్పంచ్‌గా కూటమి బలపరిచిన జెట్టి భారతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపసర్పంచ్‌గా పరుచూరి రాంబాబు బాధ్యతలు చేపట్టనున్నారు. గ్రామంలోని మొత్తం 12 వార్డులకు గాను తెలుగుదేశం పార్టీ 8, జనసేన పార్టీ 3 వార్డులను కైవసం చేసుకోగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక వార్డును దక్కించుకుంది. దీంతో గ్రామంలో కూటమి స్పష్టమైన ఆధిపత్యాన్ని చాటుకుంది.

సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు అత్యధిక వార్డుల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో గ్రామంలో పండుగ వ